Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 31 - No.11

December 2025




## క్రైస్తవ దాతృత్వం

సందేశం

# క్రీస్తు - కానుక పెట్టె

సరిగ్గా 24 గంటల తర్వాత సిలువపై తన జీవితాన్ని దారబోయుచున్నాడని ఎరిగిన యేసయ్య దేవాలయాన్ని దర్శించి తన బహిరంగ సేవను బీద విధవరాలు ఇచ్చిన రెండు కాసులను మెచ్చుకుంటూ ముగించారు (మార్కు 12:41-44). అంతేకాదు, యేసుప్రభువు చెప్పిన 38 ఉపమానాలలో 16 ఉపమానాలు డబ్బును గూర్చి చెప్పబడినవి. తాను జీవించే చివరి క్షణాలు ప్రజలు ఇచ్చే కానుకలపై దృష్టి ఉంచుటను బట్టి దైవసేవకు మనం ఇచ్చే కానుకలు ముఖ్యమైనవిగా భావించాలి. ఎందుకంటే...

**1. ప్రభువు మనమిచ్చే కానుకలను చూస్తాడు:** నాటి యెరూషలేము దేవాలయంలో కానుకలను సమర్పించడానికి బూర లేక బాకాను పోలిన పదమూడు కానుకపెట్టెలు ఉండేవి. వాటిని చూడడానికి దేవాలయ అధికారులు ఉండేవారు. ఈ సందర్భంలో ప్రభువు సమయం వెచ్చించి, కానుకలను, వాటిని ఇచ్చేవారిని పార చూచాడు. నేను ఇచ్చేది ఎవరు చూస్తారు? అన్న నిర్లక్ష్య వైఖరిని విడనాడి, ప్రభువు చూస్తున్నారన్న గ్రహింపుతో, భయభక్తులు కలిగి, జాగ్రత్త వహించి దైవసేవ కొరకు కాసులను లేక డబ్బును సమర్పించాలి.

**2. ప్రభువు మన హృదయ స్థితిని గుర్తిస్తాడు:** ధనవంతులనేకులు, బీద విధవరాలు, వారిచ్చిన కానుకలు ఎలా ఇచ్చారన్నది ప్రభువు గుర్తించాడు. దేవుని, దేవుని సేవ, డబ్బుపట్ల మన హృదయ వైఖరిని ప్రభువు గుర్తిస్తాడు. ఎవరికి దాసులమయ్యామో, సేవిస్తున్నామో అనేది ముఖ్యం. మన జీవిత యజమాని ధనమా లేక దైవమా అని ఆయన గుర్తిస్తాడు. ఎంత ఇచ్చామన్నదాని కంటే ఎలా ఇస్తున్నాము అనేది ముఖ్యం. మన హృదయాలను పరీక్షించుకొని సరియైన విధముగా ఇవ్వడానికి ప్రయత్నిద్దాం.

**3. ప్రభువు మనమిచ్చే కానుకలను లెక్కిస్తాడు:** బీద విధవరాలు రెండు రాగి నాణెములు లేక కాసులే ఇచ్చినప్పటికీ అవి ఎంతో గొప్పవిగా ప్రభువు లెక్కించాడు. తన భవిష్యత్‌ను ప్రభువు చేతిలో పెట్టి తనకున్నదంతయు దేవునికి, దైవసేవకు ఇచ్చింది. (మత్తయి 6:33) నమ్మి చక్కటి విశ్వాస విధానాన్ని అనుకరించింది. ఎంత పెద్ద మొత్తం ఇచ్చామన్నది ముఖ్యం కాదు, కలిగినదానిని బట్టి ఇస్తున్నామా లేదా అని ప్రభువు లెక్కిస్తాడు. ప్రభువు మనకిచ్చిన డబ్బును కూడా కలుపుకొని, మన జీవిత లెక్క దేవునికి ఇవ్వాలన్న గ్రహింపుతో దేవుని సేవకు ఇద్దాం. క్రీస్తు బోధలు, క్రైస్తవ జీవిత విధానం ఈ లోక విధానాలకంటే చాలా తీవ్రంగా ఉంటాయి.

**4. ప్రభువు మనమిచ్చిన దానికి ప్రతిఫలం ఇస్తాడు:** బీద విధవరాలు ఇచ్చిన రెండు కాసులకు ప్రతిఫలంగా 1) ప్రభువు ఆమెను గమనించాడు. బీద విధవరాలిని నాటి సమాజం గమనించలేదు సరికదా, బైబిల్ బోధించే శాస్త్రులు వారిని దిగమ్రింగుచూ వచ్చారు. 2) యేసయ్య తన శిష్యులను పిలిచి ఒక పాఠాన్ని నేర్పించడానికి కారకురాలైంది 3) అందరి ఎదుట సృష్టికర్తనుండి మెప్పు పొందింది. 4) ఆమె ఇచ్చిన రెండు కాసులు నేటి వరకును ఎందరినో ఉత్తేజపరుస్తుంది, దేవునికి ఇవ్వడానికి పురికొల్పుతుంది. ఆమె సజీవంగా నేటి వరకు నిలిచిపోయింది. ఇంతకంటే జీవితంలో ఏమి కావాలి?

**5. ప్రభువు మనమిచ్చే కానుకలను స్వీకరిస్తాడు:** ప్రభువుకు ఇచ్చే విషయంలో ధనవంతులు, బీదవారు, స్త్రీ, పురుష బేధము లేకుండా, దేవునిని ప్రేమించే ప్రతి ఒక్కరినుండి కానుకలను స్వీకరిస్తాడు. పౌలు అన్నట్లు ఉత్సాహంగా ఇచ్చే వారిని దేవుడు ప్రేమిస్తాడు. సమస్తాన్ని మనకిచ్చిన ఆ దేవదేవునికి తిరిగి ఇచ్చే అవకాశాన్ని దేవుడు మనకు ఇచ్చాడు. మనమిచ్చామన్న దానికంటే దేవుడు మన దగ్గరనుండి కూడా స్వీకరించడమనేది ఎంతో గొప్ప భాగ్యం. మనకున్న దానిని ప్రభువు చేతిలో పెట్టగలిగితే అదే మన జీవితానికి ఎంతో భద్రత, భరోసా.

చివరిగా ఈ బీద విధవరాలు ప్రభువు మనకిచ్చిన దానిలో మనమెంత ఉంచుకున్నాము, ప్రభువుకు ఎంత ఇచ్చాము అనే పెద్ద పరీక్ష పెట్టింది. పెద్ద సవాలు విసిరింది. ఈ సవాలును స్వీకరించి, పరీక్షలో నెగ్గాలంటే కనీసం పాస్ అవ్వాలన్నా తల (Head), హృదయం (Heart)తో పాటు మన పర్స్ (Wallet) కూడా మారుమనస్సు పొందాలని మార్టిన్ లూథర్ చెప్పాడు. మనిషిలో చివరిగా రావాల్సిన మార్పు, పొందవలసిన మారుమనస్సు మన 'మనీ పర్స్' అని జాన్ వెస్లీ చెప్పాడు. మన మనీ పర్స్ మారుమనస్సు పొందితే విశ్వాస జీవిత యాత్రలో తప్పక విజయం సాధిస్తాం. భళా, నమ్మకమైన మంచిదాసునిగా ప్రభువుచే గుర్తింపబడతాం. అలా చేయడానికి ప్రభువు మనందరికి సహాయం చేయునుగాక!

– ఆర్. ప్రభుదాస్, తెనాలి




Vol. 31, No. 11. December 2025
A Publication of
Union of Evangelical Students of India

EDITORIAL BOARD:
Mr. R. Srinivasa Rao - Publisher
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Mr. C. Paul Pramod - Member
Mr. K. Adam - Sec., PT
Mr. P. Ramaswamy - Sec., Lit.Dept.

SUBSCRIPTION CHARGES:
STUDENTS (1 Year) - Rs. 150
GRADUATES (1 Year) - Rs.300
STUDENTS (3 Years) - Rs. 400
GRADUATES (3 Years) - Rs.850
STUDENTS & GRADUATES (10 Years) Rs. 2000/-

FOR SUBSCRIPTION:
The prescribed subscription charges can be paid using the account / UPI ID / QR code, fill the details in the google form (https://bit.ly/SubscriptionForVJ) and inform the same to Editor VJ through whatsapp.

**Account Name : UESI Publication Trust, Andhra Pradesh**
**Account No : 43362371247,**
**SBI Nambur Branch**
**IFSC: SBIN0011994**
**Merchant Name: UESI PUBLICATION TRUST ANDHRA PRADESH**
**UPI ID : uesiptap@sbi**

CONTACT:
The Editor
Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com

# క్రిస్మస్‌లో క్రీస్తును అనుకరిద్దాం



క్రిస్మస్ అంటే మనల్ని మనం ఉపేక్షించుకోవడానికి, తగ్గించుకోవడానికి అవకాశాలను వెతుక్కోవడం. స్వీయాన్ని ఉపేక్షించుకోవడం, తగ్గించుకోవడం అనేది మన సంస్కృతిలో ఒక ప్రసిద్ధ అంశం కాదు, కానీ క్రీస్తు మనసులో క్రైస్తవ ఎదుగుదలకు ఇదే ప్రారంభ స్థానం. మనము వినయాన్ని మన జీవితాలలో అనుసరించాలంటే యేసుక్రీస్తు అనే అద్దము ఎదుట ప్రతిరోజూ నిలబడాలి. క్రీస్తులాగే మనము కూడా ఈ లోక గౌరవాలను, ఘనతలను, వైభవాలను హీనముగా చూసేటట్లు అభ్యాసం చేయాలి.

“ప్రేమ ప్రతి మనిషిని యేసుక్రీస్తుకు మాత్రమే కాదు, మొత్తం దేవుని కుటుంబానికి సేవకునిగా చేస్తుంది అని డ్వైట్ పెంతెకోస్ట్” అనే భక్తుడు రాస్తాడు. మనలను రక్షించడానికి ఆయన ఎంత కిందికి దిగివచ్చాడో, మన ఆరాధనలో మనం ఆయనను అంత ఉన్నతంగా హెచ్చించాలి, పైకి ఎత్తాలి. మానవాళి మీద తన ప్రేమను, వినయం, విధేయత ద్వారా వ్యక్తపరిచిన యేసుక్రీస్తు మాదిరిని ఈ క్రిస్మస్ సమయంలో మరలా జ్ఞాపకం చేసుకొందాం.

**విద్యార్థి జ్వాల పాఠకులందరికీ**
**క్రిస్మస్ శుభాకాంక్షలు**

## లోపలి పేజీల్లో...

- క్రీస్తు - కానుక పెట్టె - 2
- క్రిస్మస్‌లో క్రీస్తును అనుకరిద్దాం - 3
- అరుదైన అవకాశం - 4
- క్రైస్తవ దాతృత్వం - బైబిల్ వేదాంతపరమైన విశ్లేషణ - 5
- భవిష్యత్ భద్రతను డబ్బుతో ముడిపెట్టడం సరైనదేనా? - 9
- త్యాగపూరితంగా ఇవ్వడం - 10
- నెక్స్ట్ టైమ్ ఇట్ విల్ బి డిఫరెంట్ - 12
- నీవు ఎవరికి దాసుడవు? -13
- దాతృత్వమంటే? - 15
- క్రిస్మస్‌కి స్పందన - 18
- దేశ నివాసుల మీద - వెలుగు ప్రకాశించే- 19
- దైవమానవుడైన క్రీస్తు - 20
- యెహోవా సాక్షులు - 24
- రిస్క్ తీసుకోవాలి - 29
- నిన్నెలా అర్థం చేసుకోను ప్రభూ! - 32

# అరుదైన అవకాశం

"నీవు అలాగే నిలబడు, నేను నీకోసం పోరాడతాను, నేను అక్కడే నిలబడ్డాను. ఆయన నా కోసం పోరాడాడు" అని జెమీమా రోడ్రిగ్స్ చెప్పిన మాటలు కొన్ని కోట్ల మంది హృదయాల్లో సంతోషాన్ని నింపాయి (2025 అక్టోబర్ 30న, ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్లో గెలిచి ఫైనల్లో అడుగుపెట్టిన రోజు). ప్రపంచ వేదికపై ప్రభువు యొక్క ప్రత్యేక కృపను చెప్పేందుకు జెమీమాకు వచ్చిన అవకాశం మనకు రాకపోవచ్చు. కానీ మన పొరుగువారితో ప్రభువు గురించి చెప్పే అవకాశం మనకెప్పుడూ ఉంటుంది. ఇలా ఇతరులకు అకస్మాత్తుగా చెప్పగలిగే స్థాయికి చేరాలంటే ఎప్పుడూ ఆయన ప్రేమతో, ప్రేరణతో సంసిద్ధంగా ఉండాలి. బ్రతుకుట క్రీస్తే, చావైతే లాభం అని పౌలు చెప్పడంలో ఉద్దేశం – పరిస్థితులతో సంబంధం లేకుండా (చెరసాలలో ఉన్నా) ప్రభువు ప్రేమను ప్రకటించాలని. అందుకే అగ్రిప్ప రాజు ముందు ధైర్యంగా మాట్లాడిన పౌలును చూస్తాం. సువార్త ప్రాధాన్యతను అర్థం చేసుకొన్న మనం జీవితంలో ఇదే చివరి నెలగా భావించి, మన సంపద, సమయం, సామర్థ్యాలను సంపూర్ణంగా వాడుకుందాం. మన స్నేహితుల రక్షణ కోసం చేసే ప్రయత్నాలలో క్రిస్మస్ సందేశాన్నిచ్చే ప్రసంగీకులు కూడా చాలా శ్రద్ధతో, సిద్ధపాటుతో దేవుని వర్తమానంతో రావాలని ప్రార్థనలు కొనసాగించాలి. వారి ఆత్మీయత, వారి శారీరక ఆరోగ్యం కూడా ప్రధానమైన పాత్ర పోషిస్తాయి. ఈ ప్రత్యేకమైన సీజన్‌లో శ్రద్ధతో, శుద్ధ మనసుతో సువార్తను అందిద్దాం.

ఇందులో భాగంగా ప్రసంగీకులు ఇదే చివరి అవకాశంగా భావించి, చెప్పే తమకు, వినే విద్యార్థులకు కూడా చివరి అవకాశమని గ్రహించి ఎంతో శ్రద్ధతో, తీవ్రతతో, పరిశుద్ధాత్ముని శక్తితో ప్రకటించాలి.

ప్రోగ్రామ్ నిర్వహించే వారు కూడా ప్రసంగీకులతో సమానమైన పాత్ర పోషించాలి. చాలాసార్లు ప్రసంగీకుల కంటే ఎక్కువ భారాన్ని మోయాల్సి వస్తుంది. విద్యార్థులను ముందుగా ఆహ్వానించి, ఆహ్వానించిన వారికి ప్రేమతో మళ్ళీ గుర్తుచేసి సమయానికి వచ్చేటట్లు చూడాలి. ఎక్కువ సార్లు ప్రేమతో జ్ఞాపకం చేయడం వలన మన ప్రోగ్రామ్ ప్రాధాన్యత వాళ్ళకు అర్థమవుతుంది. క్రిస్మస్ కోసం కాకపోయినా మన ప్రేమను కాదనలేక వచ్చే విధంగా ఉండాలి. దీని పట్ల మనకు ఎంతో శ్రద్ధ అవసరం. శ్రద్ధలో భాగంగా చక్కని పాటలు, సమయానికి సందర్భమైన స్కిట్స్, వ్యవహారిక భాషలో కార్యక్రమాన్ని నడిపించడం ముఖ్యమైనవి.

ఎంతో సమయాన్ని, సంపదను, సామర్థ్యాలను వెచ్చించి అందిస్తున్న సువార్త ద్వారా సంపూర్ణ ప్రయోజనం కలగాలంటే ఫాలోఅప్ కూడా చాలా ప్రాముఖ్యమని మనకు తెలుసు. తెలిసిన ఈ విషయాన్ని శ్రద్ధతో పాటించి నిత్యత్వానికి బాటలు వేద్దాం. నిత్యుడగు తండ్రి హృదయంలో సంతోషం పుట్టించి, విద్యార్థుల జీవితాలను నిత్య సంతోషంతో నింపుదాం. నరకం నుండి తప్పిద్దాం. ఆధునిక పౌలులా దేవుని ఉద్దేశాన్ని నెరవేరుద్దాం. జెమీమాలా ప్రపంచ వేదికపై ప్రభువు ప్రత్యేకమైన కృపను ప్రకటించకముందు, మనం మన ప్రక్కింటి వారితో, పొరుగు వారితో అద్భుతమైన ప్రేమను పంచుకొందాం. ఇదే అరుదైన అవకాశం.

ఆయన ప్రణాళికలో మీ....

ఆర్. శ్రీనివాస్
యుఇయస్ఐ–ఏపి స్టేట్ సెక్రటరీ, గుంటూరు





# క్రైస్తవ దాతృత్వం

## బైబిల్, వేదాంతపరమైన విశ్లేషణ

**పరిచయం:**

ప్రతి క్రైస్తవునిలో, ప్రతి సంఘంలో, ప్రతి పరిచర్యలో దాతృత్వము అనేది చాలా ప్రాముఖ్యమైన ఆధ్యాత్మిక క్రమశిక్షణ. సంఘము యొక్క డబ్బుకు, ప్రేషిత సేవకు విడదీయరాని సంబంధం ఉన్నది. అయితే, దాతృత్వం పట్ల లేఖన ఆధారితమైన అవగాహన చాలా కొద్దిమంది క్రైస్తవులకు మాత్రమే ఉన్నది. రోజురోజుకు తమ స్థాయిని అభివృద్ధి చేసుకోవాలనే ఒత్తిడి ప్రజలపై పెంచుతున్న ఈ వస్తు వినియోగ ప్రపంచంలో దాతృత్వం చివరి స్థానానికి వెళ్ళిపోయింది. 'డబ్బు'ను ఖర్చుచేయడానికి తీసుకునే ప్రతి నిర్ణయం ఒక 'ఆధ్యాత్మిక నిర్ణయం' అనే సత్యాన్ని ప్రజలు మరచిపోయారు. 'సౌభాగ్య సువార్త' (ప్రాస్పరిటీ గాస్పల్) ప్రచారంతో దాతృత్వం పట్ల లేఖనానుసారమైన అవగాహన, అభ్యసనం క్రైస్తవుల్లో లోపించింది. 'సౌభాగ్యాల సువార్త' క్రైస్తవ దాతృత్వాన్ని పెడద్రోవ పట్టించింది. రెట్టింపు ఆశీర్వాదాలు వెంటవెంటనే వస్తాయని చెప్పే బోధకులకే ప్రజలు డబ్బులు ఇస్తున్నారు. ఫలితంగా ఆరాధనగా భావించే క్రైస్తవ దాతృత్వం, నువ్వు ఇంత ఇస్తే అంత పొందుతావు అని చెప్పే లావాదేవీలాగ మారిపోయింది. ప్రజల అవగాహనా రాహిత్యాన్ని, ఏదో విధంగా ధనవంతులవ్వాలనే వారి ఆశను కొంతమంది టి.వి. ప్రసంగీకులు సొమ్ముచేసుకుంటున్నారు. క్రైస్తవ దాతృత్వంలో భాగమైన దశమభాగం పట్ల సౌవార్తీక క్రైస్తవ విశ్వాసులకు కూడా సరైన అవగాహనలేదు, సరైన అభ్యాసమూ లేదు. దాతృత్వ వేదాంతం, అభ్యసనాలకు సంబంధించిన శాస్త్రీయమైన, ఉదారవాదనలు (దాతృత్వము తప్పని సరిగా కలిగి ఉండాలని కొందరు, అది ఐచ్ఛికమని (ఆప్షనల్), స్వచ్ఛందంగా ఇచ్చేదని కొందరు), విభిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. దాతృత్వంపై సరైన అవగాహన రావాలంటే, పాతనిబంధన, క్రొత్త నిబంధనల మధ్య, ధర్మశాస్త్రము, కృపల మధ్య, ఇశ్రాయేలు, సంఘము మధ్య ఉన్న సంబంధాన్ని మనం బాగా అర్థం చేసుకోవాలి. దశమ భాగాన్ని మనము ఎక్కడ ఇవ్వాలి? కూలంకుషంగా చర్చించాల్సిన, ప్రస్తుత పరిస్థితులకు సరిపోయే ప్రశ్న ఇది. ఈ విషయాలన్నిటి మూలంగా దశమ భాగానికి సంబంధించిన ప్రశ్న సౌవార్తిక క్రైస్తవ విశ్వాసుల్లో కూడా అనేక చర్చలకు, అభ్యంతరాలకు కారణమవుతుంది.

*కాబట్టి ఈ వ్యాసంలో మనము ఈ క్రింది విషయాలపై దృష్టిపెడదాం.*


1. క్రైస్తవ దాతృత్వము గురించి బైబిల్ చెప్పే విషయాలు
2. క్రైస్తవ దాతృత్వానికి సంబంధించిన వేదాంతము
3. క్రైస్తవ దాతృత్వము అనే క్రమశిక్షణను అభ్యసించుట

## 1. క్రైస్తవ దాతృత్వము గురించి బైబిల్ చెప్పే విషయాలు:

పాతనిబంధన గ్రంథంలో, మోషే ధర్మశాస్త్రానికి సంబంధించిన ఆర్థిక విధానంలో దాతృత్వము మూడు రూపాలలో ఉంటుంది. అవి: అర్పణలు, బలులు మరియు దశమ భాగాలు. ధర్మశాస్త్రము ఇవ్వబడకముందే యెహోవాకు అంగీకారమైన అర్పణలను చెల్లించిన మొదటి వ్యక్తి హేబెలు (ఆది 4:4). జలప్రళయం తర్వాత, నోవహు అతని కుటుంబము యెహోవాకు బలులు అర్పించారు. దేవుడు వాటిని ఇంపైన సువాసనగల బలులుగా అంగీకరించాడు (ఆది 8:21). సర్వోన్నతుడైన దేవుని నామములో దేవుని యాజకుడైన మెల్కీసెదెకు అబ్రాహామును ఆశీర్వదించిన తర్వాత, తనకు ఉన్న సమస్తములో నుండి దశమభాగాన్ని తీసి అబ్రాహాము అతనికి ఇచ్చాడు (ఆది 14:18-20). మోషే ధర్మశాస్త్రము వచ్చిన తర్వాత ఇశ్రాయేలీయులు మూడు రకాల దశమ భాగాలను అర్పించారు.

### ఎ) లేవీయులకు ఇచ్చే దశమభాగము (సంఖ్యా 18:20-24):

లేవీయుల జీవనార్థం ఇశ్రాయేలీయులు వారికి ఈ దశమ భాగాన్ని ఇస్తారు. ఇది వారి స్వాస్థ్యము. ఎందుకంటే, వారికి దేశములో స్వాస్థ్యము లేదు. ప్రభువు, దేవుని మందిరమైన సాక్ష్యపు గుడారమే వారి స్వాస్థ్యము. లేవీయులు ఇశ్రాయేలీయుల నుండి స్వాస్థ్యాన్ని స్వీకరించి, అందులోని దశమ భాగాన్ని యాజకులకు ఇస్తారు. ఇది యాజకుల దశమభాగము (సంఖ్యా 18:25-28). ఇది దశమ భాగములో దశమ భాగము. ఇది యాజకులకు ఇచ్చే అర్పణ మాత్రమే, ప్రభువుకు ఇచ్చే బహుమానము కూడా. ఇది సంపూర్ణమైన దశమభాగము. వారు ప్రజల నుండి పొందిన అత్యుత్తమ భాగము.



### బి) పండుగ దశమ భాగము (ద్వితీ 12:17-19; 14:22-27; 26:10-16):

మూడు పండుగ సమయాల్లో దేవుడు ఏర్పరచుకొనిన ఆరాధనా ప్రదేశమైన యెరూషలేముకు (ద్వితీ 14:23) ఇశ్రాయేలీయులు ధన రూపములోగానీ, ధాన్యరూపములోగానీ తీసుకురావాల్సి ఉంటుంది. ఇది రెండవ దశమభాగం.

### సి) ఔదార్యముతో ఇచ్చే దశమభాగము (ద్వితీ 14:28-29):

అనాథలు, విధవరాండ్రు, విదేశీయుల కోసం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి ఇచ్చే దశమభాగము ఇది. మొదటి రెండు దశమభాగాలు ప్రతి సంవత్సరం ఇవ్వాలి. ఇది మూడు సంవత్సరాలకు ఒక్కసారి ఇవ్వాలి.

ఈ మూడు దశమభాగాలను కలిపితే ఇశ్రాయేలీయులు ఇవ్వాల్సిన భాగము 27-30% మధ్య ఉంటుంది. దశమభాగము గురించి మాట్లాడే చాలామంది ఈ సత్యాన్ని గుర్తించరు.

### క్రొత్తనిబంధనలో:

యెరూషలేములోని ఆది సంఘములో విశ్వాసులు తమకు ఉన్న ఆస్తినంతటిని అమ్మి అపొస్తలుల పాదాల దగ్గర ఉంచేవారు. వారు అంతా సమిష్టిగా కలిగి ఉండేవారు (అపొ.కా. 4:32). దాతృత్వము గురించి, దశమభాగము గురించిన బోధ అపొస్తలుల కార్యముల గ్రంథంలో పెద్దగా లేదు. అననీయ, సప్పీరాల మరణము విశ్వాసుల్లో గొప్ప భయాన్ని కలిగించి ఉండవచ్చు. ఫలితంగా వారు ఆర్థిక

సంబంధమైన విషయాల్లో బాధ్యతగా ఉన్నారు. ఎఫెసీ పత్రికలో పౌలు దాతృత్వము గురించి తెలియజేశాడు. ప్రేషిత సేవకు (ఫిలిప్పీ 4:14), పేదవారికి, అవసరతలో ఉన్నవారికి (2 కొరింథీ 8,9 అధ్యాయాలు), దేవుని వాక్యాన్ని బోధించే వారి కి ఇవ్వమని (గలతీ 6:6; 1 తిమోతి 5:17-18) పౌలు విశ్వాసులను ప్రోత్సహించాడు. నేరుగా దశమ భాగాన్ని గురించి తెలియజేసే వాక్య భాగాలు క్రొత్తనిబంధనలో మూడు మాత్రమే ఉన్నాయి (మత్తయి 23:23; లూకా 18:9-14; హెబ్రీ 7:1-10). దశమ భాగ అంశాన్ని ప్రస్తావించే వాక్యభాగాలు ఆరు ఉన్నాయి (మత్తయి 22:17-22; 1 కొరింథీ 9:13-14; 16:1-4; 2 కొరింథీ 8:8; 9:7; గలతీ 6:6). పాతనిబంధన కాలంలో ఇశ్రాయేలీయులు దశమభాగం ఇచ్చినట్లుగా మనం కూడా ఇవ్వాలని ఈ వాక్యభాగాలలో ఏ ఒక్కటి కూడా తెలియజేయదు. అలాగే, ఈ వాక్యభాగాలలో దశమభాగమే ప్రధాన అంశం కాదు. యేసుక్రీస్తు దశమభాగాన్ని ఇవ్వమని ఎన్నడూ ఆజ్ఞాపించలేదు, అలా అని దాన్ని ఖండించనూ లేదు. అయితే ఆనాటి యూదులు దశమభాగం ఇస్తూ తమ గర్వాన్ని ప్రదర్శి స్తుంటే, ఆయన వారి ఆలోచనలను, దృక్పథాలను ఖండించాడు.

**సంఘ చరిత్రలో:**

అపొస్తలుల కాలం తర్వాత దాతృత్వము గురించి గాని, దశమభాగం తప్పనిసరిగా ఇవ్వాల నిగాని ఎవరూ పెద్దగా రాయలేదు.[1] "...సువార్త ప్రచురించువారు సువార్తవలన జీవించాలని ప్రభువు నియమించాడు" (1 కొరింథీ 9:14) అనే వాక్యమునే ఎక్కువగా నొక్కి చెప్పేవారు. అయితే, అలె గ్జాంద్రియాకు చెందిన క్లెమెంట్ వంటి కొంతమంది సంఘపెద్దలు క్రైస్తవులు దశమభాగం ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలియజేశారు.[2] జెరోమ్, అగస్టీన్‌లు కూడా దశమభాగాన్ని ప్రస్తావించారు. మధ్యయుగ కాలంలో మతాచారసంబంధమైన చట్టము (ఎక్లీసియాస్టికల్ లా), దేశీయ, రాజకీయ చట్టాలు దశమభాగాన్ని తప్పనిసరిచేశాయి.[3] అయితే, మతసంస్కరణోద్యమ కాలంలో చాలామంది దశమభాగాన్ని వ్యతిరేకించారు (ఉదా. మార్టిన్ లూథర్, వేరువేరు ప్రదేశాల్లోని అనాబాప్టిస్టులు). దశమభాగము మతసంబంధమైన చట్టము. కాబట్టి



క్రైస్తవులు ఈ చట్టానికి బాధ్యులు కారు అని అయిన్‌వర్త్, జాన్సన్ వంటి వారు బోధించారు. క్రీస్తు దశమభాగాన్ని రద్దు చేశాడని, స్వచ్ఛందంగా ఇచ్చే విరాళాల ద్వారా సేవకుల, సువార్తికుల అవసరాలు తీర్చాలని మొట్టమొదటి బాప్టిస్టుగా ప్రసిద్ధిచెందిన జాన్‌స్మిత్ వాదించాడు. కాల్విన్, జడ్‌వింగ్లీ వంటివారు దశమభాగం గురించి ఏమి చెప్పారు, వారి అభిప్రాయం ఏంటో అనేది స్పష్టంగా తెలియదు. దశమభాగం గురించి స్పష్టంగా తెలియజేసే సంస్కర్త లేకుండానే మత సంస్కరణోద్యమకాలం ముగిసిపోయింది. మతాచార సంబంధమైన చట్టాలు దుర్వినియోగం అవడం, ఫాదిరిలు, గురువులు, ప్రజలను దోచుకోవడం, క్రైస్తవ్యాన్ని ఒక వ్యాపారంగా మార్చడం వంటి మత సంస్కరణోద్యమానికి ముందు ఉన్న దురాచారాలే దశమభాగాన్ని పెద్దగా ప్రచారం చేయకపోవడానికి కారణం అని అర్థం చేసుకోవాలి. దశమభాగం కన్నా ఎక్కువగా, త్యాగపూరితంగా దాతృత్వం ఉండాలని జాన్‌వెస్లీ బోధించాడు[4].

మత సంస్కరణోద్యమ కాలం నుండి ప్రస్తుత కాలం వరకు దాతృత్వం గురించి, ముఖ్యంగా దశమభాగం గురించి మూడురకాల వ్యక్తులు, వారి అభిప్రాయాలు ఉద్భవించాయి. అవి:

1. దశమభాగం ఇవ్వడం క్రైస్తవుల బాధ్యత అని చెప్పిన వారు.
2. దశమభాగం పట్ల ఆచితూచి వ్యవహరించిన వారు.
3. దశమభాగాన్ని వ్యతిరేకించిన వారు.

1. Douglas Moo, "The Law of Christ as the Fulfillment of the Law of Moses" in Five Views on Law and Gospel, 319.
2. Thomas J. Powers, An Historical Study of the Tithe in the Christian Church to 1648 (a Ph. D dissertation), p. 32.
3. W. H. Jellie
4. Powers, p. 36.

ఈ అంశానికి ముగింపుగా మేము చెప్పేది ఏంటంటే, దశమభాగం గురించి బైబిల్‌లో నేరుగా, స్పష్టంగా చెప్పనప్పటికీ, మనం ఇష్టపూర్వకంగా, క్రమంగా, అదాయానికి తగిన విధంగా, ధారాళంగా, త్యాగపూరితంగా ఇవ్వాలి. సాంప్రదాయంగా ఇచ్చే దశమభాగం కన్నా ఎక్కువే ఇవ్వమని పౌలు మనల్ని ప్రోత్సహిస్తున్నాడు అని క్రెయిగ్ బ్లోమ్ బర్గ్ తెలియజేశాడు[5]. ఈ విషయంపై ఇంకా స్పష్టంగా రాస్తూ వాల్టర్ కెయిసర్ ఈ ప్రశ్న వేశాడు "ధర్మశాస్త్రం ప్రకారం దశమభాగం కనిష్ఠ దాతృత్వం. క్రైస్తవులు ఈ కనిష్ఠంకన్నా తక్కువ ఎలా ఇస్తారు?" [6]. కాబట్టి క్రొత్త నిబంధనలో దాతృత్వానికి సంబంధించిన నిబద్ధతను, విలువను పెంచారేగాని, తగ్గించలేదు. క్రైస్తవ దాతృత్వానికి సంబంధించిన వేదాంతము, అభ్యాసము అనే విషయాలను గురించి తెలుసుకునేముందు మనకు ఈ అవగాహన చాలా అవసరం.

## 2. క్రైస్తవ దాతృత్వానికి సంబంధించిన వేదాంతము:

దేవునికి, ఆయన ప్రజలకు ఇచ్చే విషయంలో యోహాను, పౌలు తమ రచనల ద్వారా తెలియజేసిన విషయాలను ఈ భాగంలో మనం తెలుసుకుందాము[7]. బైబిల్ అంతటిలో మేము కనుగొన్న విషయాలు, వాటిపై మా ఆలోచనలను మేము ఈ భాగంలో తెలియజేస్తున్నాము.

### ఎ) బైబిల్‌లోని దేవుడు ప్రేమతో ఇచ్చే దేవుడు:

ప్రేమను, దాతృత్వాన్ని మనం కలుపుతున్నాము. ఎందుకంటే, లేఖనానుసారంగా చెప్పాలంటే, నిజమైన ప్రేమ ఎల్లప్పుడూ ఇస్తుంది. ఈ విషయం దేవునిలో స్పష్టంగా కనిపిస్తుంది. నిజానికి దాతృత్వము అనే అంశాన్ని ప్రస్తావించకుండా దైవప్రేమను (గ్రీకులో అగాపే) మనం నిర్వచించలేము. అగాపే అంటే, నిస్వార్థంగా, త్యాగపూరితంగా, ఇతరులనుండి ఏమీ ఆశించకుండా వారికి ఇవ్వడం. దేవుడు ప్రేమయైయున్నాడని (1 యోహాను 4:8,10), ప్రేమ దేవుని నుండి వస్తుందని (వ.7) బైబిల్ తెలియజేస్తుంది.

కాబట్టి, బైబిల్ దేవుడు స్వాభావికంగా ప్రేమగల దేవుడు. దీని అర్థం ఏంటంటే ఆయన ఇచ్చే దేవుడు. ఆయన ఇస్తాడు ఎందుకంటే ఆయన ప్రేమగలవాడు. అందుకే మన ప్రేమ మాటలలోనే కాక, కార్యరూపం దాల్చాలని బైబిల్ మనల్ని ప్రోత్సహిస్తుంది (1యోహాను 3:18). మన "ప్రేమ పూర్వక మాటల్లో", "ప్రేమ పూర్వక పనుల్లో" ప్రేమ లోపించే అవకాశం ఉన్నది (1 కొరింథీ 13:3). కాబట్టి మనం ప్రేమ చూపించే విషయంలో ఎదగాలి. మన మాటలకు, పనులకు పొంతన ఉండాలి. అంతర్గతంగా ఉండే మన భావోద్రేకాలు, దృక్పథాలు, ఆలోచనలు, బయటకు కన్పించే పనులు ఒకేవిధంగా ఉండేటట్లు చూచుకోవాలి. మన దేవుడు పరిపూర్ణమైన దేవుడు. ఆయనలో ఎలాంటి లోటుపాట్లు ఉండవు.

బైబిల్ దేవుడు త్రియేక దేవుడు. అంటే, నిత్యత్వములోనూ, నిత్యశక్తిలోనూ, దైవత్వములోనూ సమానమైన ముగ్గురు వ్యక్తుల సమూహము మన దేవుడు. పరిశుద్ధ త్రిత్వములోని ముగ్గురు వ్యక్తులు ఒకరిపట్ల మరొకరు నిత్యమైన ప్రేమ, దాతృత్వాల ను చూపిస్తుంటారు. అందుకే, మానవరూపంలో యేసుక్రీస్తు అనే నామంలో వచ్చిన ఆ దేవుడు, ఒక ప్రధాన యాజకునివలె ఈ ప్రార్థనను చేశాడు. "వారియందు నేనును నాయందు నీవును ఉండుట వలన వారు సంపూర్ణులుగా చేయబడి యేకముగా ఉన్నందున నీవు నన్ను పంపితివనియు, నీవు నన్ను ప్రేమించినట్లే వారిని కూడా ప్రేమించితివనియు లోకము తెలుసుకొనునట్లు నాకు అనుగ్రహించిన మహిమను వారికి ఇచ్చితిని. తండ్రీ నేనెక్కడ ఉందునో అక్కడ నీవు నాకు అనుగ్రహించిన వారును నీతో కూడా ఉండవలెననియు, నీవు నాకు అనుగ్రహించిన మహిమను వారు చూడవలెననియు కోరుచున్నాను. జగత్తు పునాది వేయబడకమునుపే నీవు నన్ను ప్రేమించితివి. నీతి స్వరూపుడవగు తండ్రీ లోకము నిన్ను ఎరుగలేదు. నేను నిన్ను ఎరుగుదును. నీవు నన్ను పంపితివని వీరెరిగియున్నారు. నీవు నాయందు ఉంచిన ప్రేమ వారి యందు ఉండునట్లు

5. Craig Blomberg, Neither Poverty Nor Riches, pp. 198-199.
6. Walter Kaiser, Leviticus: Interpreters' Bible, p. 119.
7. This whole section is based purely on our personal study and reflection over the years and hence you will not find any quotations or citations. we would have undoubtedly imbibed some ideas, insights, and principles from others that we have heard, seen, and read over the years in a natural and unconscious manner and we are grateful for all these inputs.

నేను వారియందును ఉండునట్లు వారికి నీ నామము తెలియజేసితిని. ఇంకను తెలియజేసెదనని చెప్పెను" (యోహాను 17:23-26).

ఈ చిన్న వాక్యభాగం ఈ క్రింది అంశాలను స్పష్టంగా తెలియజేస్తుంది:

1. నిత్యమైన దేవుడు నిత్యమైన ప్రేమ, దాతృత్వము గలవాడు.
2. తండ్రి తన కుమారుణ్ణి ఈ లోకానికి పంపించడం ద్వారా దైవత్వంలోని ఈ నిత్యమైన ప్రేమ మనకు తెలిసింది.
3. తనపట్ల తండ్రికి ఉన్న ఈ దైవప్రేమ తన శిష్యుల్లో కూడా ఉండాలని యేసుక్రీస్తు ఆశించాడు. దేవుని ప్రేమ పూర్వక దాతృత్వాన్ని యోహాను 3:16లో కూడా చూస్తాము. తన కుమారుణ్ణి మానవాళికోసం త్యాగం చేసేంతగా దేవుడు మానవాళిని ప్రేమించాడని ఈ వచనం తెలియజేస్తుంది.[8]

యేసుక్రీస్తు సిలువ మరణం ద్వారా మానవాళిపట్ల దేవుడు తన ప్రేమను తెలియచేశాడని పౌలు చెప్పాడు (రోమా 5:8). మన పాపాలకు పరిహారంగా దేవుడు తన కుమారుని ఈ లోకానికి పంపడం ద్వారా దేవుడు తన ప్రేమను మానవాళి పట్ల ప్రదర్శిం చాడని యోహాను తెలియజేస్తున్నాడు (1 యోహాను 4:7-12). ఈ సత్యాన్ని గురించి మాట్లాడుతూ ఆయన ఇలా అన్నాడు: "మంచికాపరి గొర్రెల కొరకు తన ప్రాణము పెట్టును" (యోహాను 10:11). బహుశా అందుకేనేమో, దేవుని ప్రేమ పూర్వక దాతృత్వానికి సాదృశ్యమైన సిలువ క్రైస్తవ్యానికి 'చిహ్నంగా' మారిపోయింది. ఈ గొప్ప దేవుని ప్రేమ, ఇంకా పౌలు మాటల్లో చెప్పాలంటే దాని వెడల్పు, పొడవు, ఎత్తు ఎంతో మానవ జ్ఞానానికి అందనిది (ఎఫెసీ 3:17-19). ఆ గొప్ప దేవుని ప్రేమ పట్ల మన ప్రతిస్పందన ఎలా ఉండాలి?

మిగిలినది వచ్చే సంచికలో...

- యం. సుధాకర్ (డైరక్టర్) మరియు యం. శాంతకుమారి (అకడమిక్ డీన్)
హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ థియాలజీ అండ్ అపాలజిటిక్స్ (హిత), హైదరాబాద్

8. In His relationship to humanity, God was, is, and will be always loving. Right at the beginning of human history, we see God as a giving God (Gen. 1: 29-30) and we see the same truth in the history of God-Human relationship that followed.




**1. భవిష్యత్ భద్రతను డబ్బుతో ముడిపెట్టడం సరైనదేనా?**

నేడు లోకంలోని వారితో పోటీగా విశ్వాసులు కూడా ఎంత డబ్బు వెనకేసుకుంటే వారి కుటుంబానికి భవిష్యత్‌లో అంతభద్రం అని భావిస్తున్నారు. కాని దేవుని వాక్యం "కాగా దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తుయేసునందు మహిమలో మీ ప్రతి అవసరమును తీర్చును (ఫిలిప్పీ 4:19)" అని, మత్తయి 6: 24-34 ప్రకారం ..ఏమి తిందుమో యేమి ధరించుకొందుమో అని, రేపటిని గూర్చి చింతింపకుడి అని... అన్యజనులు వీటన్నిటి విషయమై విచారి స్తారని చెబుతుంది. గనుక మన భవిష్యత్ భద్రత డబ్బుపైగాక దేవుని మాటపై నమ్మకముంచి, దేవుని మీద ఆధారపడాలి. డబ్బుతో మన భద్రతను ముడిపెట్టడం మన బీద ఆత్మీయ స్థితిని తెలియజేస్తుంది.

అలాగని డబ్బుని పొదుపుగా వాడటం, భవిష్యత్ అవసరాల కొరకు ఆదా చేయటం తప్పుకాదు. అల్ప జీవులైన చీమలు కూడా ఆహారాన్ని భవిష్యత్ కొరకు దాచుకొంటాయి (సామె 6:6-8). మంచివారు తమ పిల్లల పిల్లల కొరకు సంపాదించాలని బైబిలు (సామె 13:22) చెబుతుంది. ధనాన్ని పెట్టుబడిగా పెట్టి వృద్ధిచెందించటం దేవుని పద్ధతి (లూకా 19:23). ఐనప్పటికీ మన భద్రత ధనంలో కాదు దేవునిలోనే.




# త్యాగపూరితంగా ఇవ్వడం

ఇవ్వడం లేదా త్యాగపూరితంగా ఇవ్వడం అనేది గృహనిర్వాహకత్వంలో ఒక భాగం. యజమాని మనకు అప్పగించిన వాటిని (అవి సమయం, తలాంతులు, సంపద లేదా ధనం కావచ్చు) యజమానికి లాభం చేకూర్చే విధంగా నమ్మకంగా ఉపయోగించడమే గృహనిర్వాహకత్వం. మనకన్నా ఎంతో మంది గొప్పవారు ఉన్నప్పటికీ, ఆయన మనల్ని నమ్మి వాటిని మనకు అప్పగించాడన్న సంగతి మనం గుర్తుచేసుకుందాం.

వినియోగానికి ప్రాధాన్యతనిస్తున్న ఈ ప్రపంచంలో సమయానికి, డబ్బుకు మనం విలువనిస్తున్నాం. సూపర్ మార్కెట్‌లకు, బిగ్‌బజార్లకు, మాల్స్‌కు ఈ విషయం బాగా తెలుసు. అవి నీ డబ్బును తీసుకుంటాయి. నీకు సమయాన్ని ఇస్తాయి. సరుకులను, ఎలక్ట్రానిక్ పరికరాలను, చివరికి ఔషధాలను కూడా ఇంటి వద్దకు తెచ్చే అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థలు గొప్ప ధనవంతమైన సంస్థలుగా మారాయి. దేవుని పరిచర్య దగ్గరకు వచ్చేసరికి ఇవ్వడం ఒక సమస్యలా మారిపోతుంది. మనల్ని మనం దేవునికి ఇచ్చుకోకుండా, మన సమయాన్ని, తలాంతులను, డబ్బును దేవునికి ఇవ్వలేము. 2 కొరింథీ 8:5లో ఇలా ఉన్నది. “ఇదియుగాక మొదట ప్రభువుకును, దేవుని చిత్తము వలన మాకును, తమ్మును తామే అప్పగించుకొనిరి. ఇంతగా చేయుదురని మేమనుకొనలేదు”. క్రైస్తవ దాతృత్వానికి ఈ విషయం చాలా కీలకమైన సూత్రమని యన్ఐవి స్టడీ బైబిల్‌లో ఉన్నది. నీవు, నీ సమయం, నీ తలాంతులు, నీ డబ్బు వేరువేరు కాదు. ఈ మూడింటిలో నీవు ప్రతిబింబిస్తావు. వీటిని నీవు దేవునికి ఇవ్వకపోతే, నిన్ను నీవు దేవునికి అప్పగించుకోనట్లే.

ఇవ్వడం అనేది ఒక కృపాసహితమైన పని. ఈ కృపాసహితమైన పనిలో మనం అంతకంతకు వర్ధిల్లాలని దేవుని వాక్యం మనల్ని ప్రోత్సహిస్తుంది. మాసిదోనియా సంఘము, వారి సామర్థ్యానికి మించి దాతృత్వాన్ని చూపించింది. వారు ఇష్టపూర్వకంగా, స్వచ్ఛందంగా ఇచ్చి, పరిశుద్ధులకు జరిగించిన ఈ పరిచర్యలో పాల్గొనే ధన్యతను వారు పొందారు. సామర్థ్యానికి మించి ఇవ్వడమే త్యాగపూరిత దాతృత్వం. గొప్పగా దాతృత్వాన్ని ప్రదర్శించే క్రమంలో కఠోరమైన వారి పేదరికం అడ్డుగా మారలేదు. అందుకే తమ ఆస్తిని, డబ్బును నమ్ముకోకుండా



*మనము దేవునికి ఇచ్చే దానికి అనుగుణంగా దేవుడు మన రాబడిని తగ్గిస్తే, మన రాబడి ఎంత ఉంటుంది?*

*- ఆస్వాల్డ్ జె. స్మిత్*

సత్క్రియలు అనే ధనము గలవారై ఉండాలని పౌలు 1 తిమోతి 6:17-19లో ఆజ్ఞాపిస్తున్నాడు. జాగ్రత్తగా గమనిస్తే పేదవారే ఎక్కువగా ఇస్తున్నట్లు తెలుస్తుంది. అందుకే, ఆ పేద విధవరాలు అందరికన్నా ఎక్కువ ఇచ్చిందని యేసుక్రీస్తు చెప్పారు. మనం ఎలాంటి దృక్పథంతో ఇస్తున్నామన్నదే అతి ప్రాముఖ్యమైన విషయం.

మన దృష్టిలో విలువైనది ఏంటి? వస్తువులా, ధనమా లేక ప్రజలా? తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలితగారు విస్తారమైన సంపదను సంపాదించుకున్నారు. దానిని ఇప్పుడు ఎవరు అనుభవిస్తున్నారు? సంపద పట్ల సరైన దృక్పథం మన ఆధ్యాత్మికతకు సూచనగా ఉంటుంది. యేసుక్రీస్తు పేదరికాన్ని గొప్పగా అభినందించలేదు. న్యాయబద్ధంగా సంపాదించుకోవడాన్ని కూడా ఆయన విమర్శించలేదు. మనం వస్తువులను సంపాదించుకోవడం తప్పుకాదు. మనం ఆ వస్తువుల నియంత్రణలోకి వెళ్ళిపోవడం తప్పు. మనం వాటి ఆధీనంలోకి వెళ్తే మనలో వస్తువుల పట్ల అపేక్ష పెరుగుతుంది. ఇది విగ్రహారాధనతో సమానం. మన హృదయాలు వాటికి బానిసలవుతాయి. మనం దేవునికి, ధనానికి దాసులుగా ఉండలేము. ఈ రోజులలో టీ.వి.లో వాక్యాన్ని బోధించే సువార్తికులు, సేవకులు, ప్రవక్తలు ధనసహాయం కోసం అభ్యర్థించడం మనం చూస్తున్నాము. మనం వారి మాయలో పడి, మనల్ని ఆత్మీయంగా పెంచి పోషించిన సంఘాలను, సంస్థలను నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తపడదాం.

పాతనిబంధన గ్రంథంలో పదవ వంతు ఇవ్వడం తప్పనిసరి. దశమ భాగం దేవునిది. దేవునికి చెందినదానినే దేవునికి ఇచ్చి, నేను దేవునికి ఇచ్చాను అని చెప్పుకోవడం ఎంతవరకు సమంజసం? నిజానికి దేవునికి చెందిన దానినే తిరిగి మనం దేవునికి ఇస్తున్నాము. 2 సమూయేలు 24:24లో రాజైన దావీదు అరౌనాతో ఇలా చెప్పాడు! వెల ఇయ్యక నేను తీసుకొనిన దానిని నా దేవుడైన యెహోవాకు దహనబలిగా అర్పించనని అరౌనాతో చెప్పి ఆ కళ్ళమును, ఎడ్లను ఏబది తులముల వెండికి కొనెను. "...మీలో ప్రతివాడును తాను వర్ధిల్లిన కొలది తన యొద్ద కొంత సొమ్ము నిలువచేయవలెను"(1 కొరింథీ 16:2) అనేది కొత్త నిబంధనలోని సూత్రము. మనము దేవునికి ఇచ్చే దానికి అనుగుణంగా దేవుడు మన రాబడిని తగ్గిస్తే, మన రాబడి ఎంత ఉంటుంది? అని ఆస్వాల్డ్ జె. స్మిత్ గారు ఒక పుస్తకంలో రాశారు. క్రొత్తనిబంధన దాతృత్వానికి సంబంధించి నాలుగు విషయాలు బోధిస్తుంది.

1. వ్యక్తిగతంగా ఇవ్వాలి
2. క్రమంగా ఇవ్వాలి
3. రాబడికి తగిన విధంగా ఇవ్వాలి
4. వర్ధిల్లిన కొలది ఇవ్వాలి

**దేనికోసం**

1. స్థానిక సంఘ, పరిశుద్ధుల సహాయార్థం
2. దేవుని ప్రజల, పేదల అవసరాలు తీర్చడానికి
3. సార్వత్రిక, ప్రేషిత సేవ కోసం

**దాతృత్వం పట్ల మన దృక్పథం ఎలా ఉండాలి?**

2 కొరింథీ 9:6-8లో ఈ క్రింద తెలిపిన మార్గదర్శకాలను మనం చూస్తాము.

1. **ప్రతివాడు తన హృదయంలో నిశ్చయించుకొన్న ప్రకారము ఇయ్యవలెను:** ఒక అవసరత గూర్చి తెలిసినప్పుడు దాని గూర్చి ప్రార్థించు. దేవుడు ప్రేరేపిస్తే ఇవ్వు. ఎవరో ఒకరు ఇస్తారులే అని దాన్ని నిర్లక్ష్యం చేయకు.
2. **రహస్యంగా ఉంచాలి:** సణుగుతూ లేదా బలవంతంగా ఇవ్వకూడదు. అలాగే ఇచ్చిన తర్వాత దాని విషయమై వాట్సప్ గ్రూప్స్‌లో సమాచారం పెట్టవద్దు లేదా, దేవుడు నిన్ను ఇలా ఇవ్వడానికి ప్రేరేపించిన దాన్ని బట్టి బహిరంగంగా ప్రార్థించకు. మనకు తెలియకుండానే మనం గర్విస్తు

న్నామని అది తెలియజేస్తుంది. నీవు ఎంత ఇచ్చావు అన్నది నీకు, దేవునికి, కోశాధికారికి మాత్రమే తెలియాలి.

### 3. సంతోషంగా ఇవ్వు

మంచి మంచి ఉద్యోగాలు సంపాదించుకోవడానికి కావాల్సిన సామర్ధ్యాలను ఇచ్చేది దేవుడే. ఆయన కనికరం, ఉపకారాలను అనుభవించే లబ్ధిదారు లము మనము. కొన్నిసార్లు మనం చిన్న పిల్లల్లా ప్రవర్తిస్తుంటాము. నీవు ఒక చాక్లెట్‌నో లేదా ఒక బిస్కెట్ ప్యాకెట్‌నో కొని నీ పిల్లలకు ఇస్తావు. నీవు ఒక ముక్క ఇవ్వమని వారినడిగితే దాన్ని వెనుక దాచిపెట్టుకొని అయిపోయింది అంటారు. నవ్వుకొని దాన్ని వదిలేస్తాం. అయినా మరలా వారికి కొనిస్తుంటాం. దేవుడు మనల్ని ప్రేమించే మన పరలోకపు తండ్రి. ఆయన ఏ మంచి బహుమానాన్ని మనకు ఇవ్వకుండా దాచిపెట్టుకోడు. ఆయన దాతృత్వానికి మనం ఎలా ప్రతిస్పందిస్తున్నాము? మనం ఆయనను ప్రేమించామని కాదు, ఆయనే మనల్ని మొదట ప్రేమించి, మన పాపాలకు పరిహారంగా బలి అవ్వడానికి ఆయన తన కుమారుని పంపించాడు. ఇచ్చే విషయంలో మనం దేవునిని ఎన్నడూ మించిపోలేము. ఆయన ఇస్తాడు, ఇస్తాడు, క్షమిస్తాడు. కానీ సమస్య మనతోనే. మనం పొందుకొంటాము, పొందుకొంటాము, మరచిపోతాము. ఎంత విచారకరం!

దేవుని యొద్ద దొంగతనం చేయడం అనే విషయాన్ని మలాకీ 3:8లో తెలియజేస్తున్నాడు. నీవు ఆయన చిత్తం ప్రకారం సంతోషంగా ఆయనకు ఇస్తే, ఆయన తన వాగ్దానాన్ని నెరవేర్చే బాధ్యునిగా మనం ఆయనను చేసినవారమవుతాము. “నా మందిరములో ఆహారముండునట్లు పదవ భాగమంతయు మీరు నా మందిరపు నిధిలోనికి తీసుకొనిరండి. దీని చేసి మీరు నన్ను శోధించిన యెడల నేను ఆకాశపు వాకిండ్లను విప్పి, పట్టజాలనంత విస్తారముగా దీవెనలు కుమ్మరించెదనని సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చుచున్నాడు” (మలాకీ 3:10). మనల్ని ప్రజలు ఆశీర్వదించబడినవారని పిలుస్తున్నారా? మొదట దేవుని రాజ్యాన్ని, ఆయన నీతిని వెదుకుతూ మన ప్రాధాన్యతలను ఏర్పరచుకొన్నప్పుడు దేవుడు మన అవసరాలన్నిటినీ తీరుస్తాడు. దేవుడు ఏ మనిషికీ అప్పు ఉండడు. క్రిస్మస్ షాపింగ్‌కు వెళ్ళేముందు ఈ విషయాలన్నీ గుర్తుపెట్టుకో.

2 కొరింథీ 9:8లోని ఈ అద్భుతమైన వాగ్దానాన్ని మనందరం సొంతం చేసుకుందాం. ‘‘మరియు అన్నిటియందు ఎల్లప్పుడును మీలో మీరు సర్వసమృద్ధిగలవారై ఉత్తమమైన ప్రతికార్యము చేయుటకు దేవుడు మీ యెడల సమస్త విధములైన కృపను విస్తరింపచేయగలడు”.

దాతృత్వంలో ఆయనవలె ఉండుటకు దేవుడు మనకు సహాయం చేయునుగాక!

*– విజే దెస్క్*

## NEXT TIME IT WILL BE DIFFERENT!



**The First Time Jesus Came:**
He came veiled in the form of a child.
A star marked His arrival.
Wise men brought Him gifts.
There was no room for Him.
Only a few attended His arrival.
He came as a baby.

**The Next Time Jesus Comes:**
He will be recognized by all.
Heaven will be lit by His glory.
He will bring rewards for His own.
The world won’t be able to contain His glory.
Every eye shall see Him.
He will come as Sovereign King and Lord of all.

*-John F. MacArthur, Jr.*

# నీవు ఎవరికి దాసుడవు?



"దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను కాగా తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" – యోహాను 3:16

**తండ్రి దాతృత్వం:** తండ్రి తన ఏకైక కుమారుని (నిత్యజీవం) 'ఇచ్చాడు'. 'నిత్యనాశనం' నుండి మనల్ని విడిపించడానికి నిత్యప్రేమతో నిత్యజీవాన్ని అనుగ్రహించాడు. దేవుని స్వభావం ఇవ్వడమే. దానికి కారణం ఆయన ప్రేమే. ఉద్దేశం– దేవుని స్వభావం మనలో కార్యరూపం దాల్చుటకే.

తండ్రి ఇచ్చేవాడు మాత్రమే కాదు, తీసుకునేవాడు కూడా. తీసుకున్న దానిని మరలా మనకే నూరంత లుగా ఇచ్చేవాడు. ఆయన స్వభావం ఇవ్వడం. ***సమస్తాన్ని ఇచ్చేవాడు, సమృద్ధిగా ఇచ్చేవాడు, సంపూర్ణంగా ఇచ్చేవాడు.*** "క్రీస్తునందు పరలోక సంబంధమైన ప్రతి ఆశీర్వాదం అనుగ్రహించెను (ఎఫెసీ 1:3).

**కుమారుని దాతృత్వం:** దేవత్వము యొక్క సర్వ పరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించుచున్నది (కొలస్సీ2:9). దేవుని యొక్క దాతృత్వం స్పష్టంగా మనం అర్థం చేసుకోగలిగింది కేవలం యేసుక్రీస్తు ద్వారా మాత్రమే.

**యేసుక్రీస్తులో జరిగినవి, ఆయన ఖాళీ చేసినవి మూడు:**

1. **సింహాసనం:** సింహాసనం ఖాళీ కాకపోతే దేవుడు మనల్ని సమీపించలేడు. అందులో దాతృత్వం ఉంది.
2. **సిలువ:** సిలువ ఖాళీ కాకపోతే మనము ఆయనను సమీపించలేము. అందులో దాతృత్వం ఉంది.
3. **సమాధి:** సమాధి ఖాళీ కాకపోతే ఆయన దాతృత్వాన్ని మనం అనుభవించలేము.

యేసుక్రీస్తు జననం నుండి (పశువులపాక ప్రస్థానం) చనిపోయే వరకు అనుభవించింది కేవలం అవమానమే. మనకు ఆశీర్వాదం ఇవ్వడానికి ఆయన అవమానం ఇష్టపూర్వకంగా తీసుకున్నాడు. "ఆయన ధనవంతుడైయుండియు, తన దారిద్ర్యము వలన మీరు ధనవంతులు కావలెనని మీ నిమిత్తము దరిద్రుడాయెను" (2 కొరింథీ 8:9). ఇది యేసుక్రీస్తు దాతృత్వానికి పరాకాష్ఠ.

దేవుడు మేలు ఇచ్చే ముందు కీడు తీసుకొనేవాడు. కీడును సిలువలో మేలుగా మార్చి కీడు చేసిన వారికే మేలు ఇచ్చేవాడు.

**మూడు స్థాయిల్లో మనసు యొక్క తత్వం వివరించబడింది:**

1. **మూర్ఖత్వం:** మేలు చేసే వారికి కీడు చేస్తుంది
2. **మానవత్వం:** మేలు చేసే వారికి మేలు, కీడు చేసేవారికి కీడు చేస్తుంది.
3. **దైవత్వం:** కీడు చేసే వారికి కూడా మేలు చేస్తుంది.

కీడు చేసిన వారికి మేలు చేయకపోతే మనం క్రీస్తును ధరించుకున్నవారం కాదు.

**దాతృత్వం మూడు రకాలు:**

1. దశమభాగం (మలాకీ 3:10)
2. వర్థిల్లిన కొలది (1 కొరింథీ 16:2)
3. ఉన్నది అంతా, సంపూర్ణంగా (మార్కు 12:44)

ప్రొ. ఇనాక్, స్టెరెట్, జోసఫ్ అభిషేకరావు గార్లు యేసుక్రీస్తును స్పష్టంగా అర్థం చేసుకోవడం వలన ఆయన అడుగుల్లో అడుగులేశారు. వీరు ఎంచుకున్నది మూడవ స్థాయి. అది ప్రభువు స్థాయి. ప్రొ.ఇనాక్ గారికి మంచి జీతం వచ్చినా ప్రతి నెల 10వ తారీఖు వచ్చే సమయానికి సంపూర్ణంగా దేవుని పరిచర్యకు ఇచ్చి దేవునిపై ఆధారపడడం అల వాటు చేసుకున్నారు. స్టెరెట్ గారు తన స్వదేశంలో ఆస్తులు అమ్మి తమిళనాడు రాష్ట్రంలోని కోటగిరి ప్రాంతంలో (హైఫీల్డ్) 8.5 ఎకరాల స్థలం కొని ఇల్లు నిర్మించుకొని తన స్వదేశానికి వెళ్ళేటప్పుడు ఇంటిలో ఉన్న స్పూన్‌తో సహా పరిచర్యకు ఇచ్చి వెళ్ళారు. జోసఫ్ అభిషేకరావు గారు తన యవ్వన జీవితాన్ని త్యాగం చేశారు. వీరందరి అడుగుల్లో కనబడేది యేసయ్య అడుగులే. "దేవుడు ఖజానాలు నింపేది ఖాళీచేసుకోవడానికే".

**మనలో ఏమి జరుగుతుంది?**

విద్యార్థి పరిచర్యలో ఉన్న వారంతా దాదాపు పేదరికం నుండి వచ్చి ప్రభువు చేత హెచ్చించబడి, పరిచర్య ద్వారా ఉన్నత స్థానాల్లో ఉన్నవారే. కానీ దాతృత్వంలో అథమ స్థానంలో ఉన్నవారు చాలామంది ఉన్నారు. అందుకు ప్రధాన కారణం మెటీరియలిజం. మన పితరులు నేర్పిన పాఠాల్లో గొప్పపాఠం "వారికి ఆస్తులు లేవు, అప్పులు లేవు కానీ ఆత్మీయత ఉంది".

> ఈ రోజు గ్రాడ్యుయేట్స్‌కు
> 1. ఆస్తులు ఎక్కువవుతున్నాయి,
> 2. అప్పులు ఎక్కువవుతున్నాయి.
> "ఏ దాసుడు ఇద్దరు యజమానులకు దాసుడుగా ఉండనేరడు. ఒకనిని ప్రేమించి ఒకనిని ద్వేషించును" (మత్తయి 6:24).
> ఒక యజమాని దేవుడు, మరొక యజమాని ధనం.

**మనలో జరగవలసినవి:**

70 సంవత్సరాలపైబడిన యుఇయఎన్ఐ పరిచర్యలో విచారం ఏంటంటే యేసయ్య అడుగులు, మన పితరులు వేసిన అడుగులు దాదాపు కనుమరుగవుతున్నాయి. ఇంకా పరిచర్య ఇలా ఉంది అంటే అది దేవుని కృప మరియు జిల్లాకో, రీజియన్‌కో ఒకరిద్దరు యేసయ్యను, మన పితరుల ను అనుసరించేవారు ఉన్నారు కాబట్టే.

ప్రస్తుత మన బాధ్యత ప్రభువును, పితరుల జీవితాల ను ధ్యానించి అనుసరించుటకు ప్రయత్నం చేయడం, కొత్త తరానికి పాతతరానికి అంటుకట్టడం.

**దాతృత్వం మూడుస్థాయిల్లో జరుగుతుంది:**

1. శరీరం సజీవయాగంగా సమర్పించడం – రోమా 12:1
2. సమయం సమర్పించడం – లూకా 10:39
3. సంపద సమర్పించడం – 2 కొరింథీ 8:12

మనలో కొంత సంపద ఇచ్చేవారు ఉన్నారు. దానికి మించి సమయం ఇచ్చేవారు, గృహాలు తెరిచేవారి కొరత ఎక్కువగా ఉంది. మనం ధనాన్ని మూడు రకాలుగా ఇవ్వడానికి ఎప్పుడూ మన వద్ద ధనం ఉండాలి. 1. దేవుని పని నిమిత్తం (అపొ. కా. 4:34); 2. అవసరతలో ఉన్నవారి నిమిత్తం (ఎఫెసీ 4:28); 3. మన కుటుంబ అవసరాల నిమిత్తం. గనుక దేవుని స్వరూపం (దాతృత్వం) మనలో కన్పించే వరకు ప్రార్థన చేస్తే ప్రార్థనలో నుండి వచ్చే ప్రణాళికలు గుర్తించి ప్రయత్నించి ప్రభువును ఘనపరచుటకు దేవుడు సహాయం చేయును గాక!

– **బి.యం. జోసఫ్,** మార్కాపూర్



# దాతృత్వమంటే?

అపోస్తలుడైన పౌలు 2 కొరింథీ 8,9 అధ్యాయాల్లో చెప్పిన దాతృత్వానికి సంబంధించిన పది నియమాలను జాన్‌స్టాట్ ఈ క్రింది విధంగా విశదపరిచారు. అదే అధ్యాయంలో అకయ, మాసిదోనియ అనే గ్రీకు సంఘాలవారు యూదయలోని నిరుపేద సంఘాల క్షేమం కోసం కొంత సొమ్మును కానుకగా ఇచ్చేలా ఏర్పాటు చేశారు. దీన్ని ఆయన రోమా 15వ అధ్యాయంలో, 1 కొరింథీ 16వ అధ్యాయంలో కూడా ప్రస్తావించారు. దైనందిన విషయం కోసం పౌలు తన పత్రికల్లో అంత స్థలాన్ని కేటాయించడం అనేది కొంత అసాధారణంగానే అనిపించవచ్చు. పౌలుకైతే అది అసాధారణ విషయం కాదు.

నిజానికి ఆయన దాతృత్వాన్ని క్రీస్తు సిలువకు, దేవుని కృపకు, ఆత్మ ఐక్యతకు ముడిపెట్టి మాట్లాడుతున్నాడు. ఈ గంభీరమైన త్రిత్వ వేదాంతాన్ని క్రియాశీలక ఇంగిత జ్ఞాన సమ్మేళనాన్ని గ్రహించడం హృదయాన్ని కదిలిస్తుంది. సమకాలీన సంఘాల అజెండాలో క్రైస్తవ దాతృత్వం అత్యంత ప్రాముఖ్యమైన అంశం. నిధుల లేమి కలిగిన క్రైస్తవ సంస్థ ఈ ప్రపంచంలో ఒక్కటైనా ఉందా అనేదే నా అనుమానం.

క్రైస్తవ దాతృత్వానికి సంబంధించి అపోస్తలుడైన పౌలు రూపొందించిన పది నియమాలను మీ ముందుంచుతున్నాం.

## క్రైస్తవ దాతృత్వం దేవుని కృపను వ్యక్తీకరిస్తుంది

“సహోదరులారా మాసిదోనియా సంఘములకు... మీలో సంపూర్ణము చేయుమని మేము వేడుకొంటిమి 2 కొరింథీ 8:1-6.

పౌలు ఈ అధ్యాయాన్ని మొదలు పెట్టినప్పుడు మాసిదోనియాలోని సంఘాలవారి దాతృత్వాన్ని ప్రస్తావించాడని మనం గమనించగలం. ఆయన దేవుని దాతృత్వాన్ని, మాసిదోనియా సంఘాల వారికి దేవుడనుగ్రహించిన కృపను ప్రస్తావిస్తాడు. మరోవిధంగా చెప్పాలంటే పౌలు మాసిదోనియా వారి దాతృత్వం వెనుక దేవుని దాతృత్వాన్ని చూస్తాడు. దానికి కారణం దేవుడు దాతృత్వం కలవాడు కాబట్టి తన ప్రజలను కూడా దాతృత్వం గలవారిగా చేసేందుకు ఆయన వారి జీవితాల్లో పని చేస్తాడు.

మాసిదోనీయుల దాతృత్వానికి ఎంతో శ్రమ, అత్యధిక సంతోషం, నిరుపేద స్థితి తోడయ్యాయి. అయినా వారు సామర్థ్యంకంటే ఎక్కువగా ఇచ్చారు (వ.3). దీనికి కారణం వారు మొదటిగా దేవునికి అటు తర్వాత పౌలు, తన అపోస్తలుల బృందానికి అప్పగించుకున్నారు. పౌలు కూడా తీతును తాను కొంత కాలం క్రితం కొరింథులో మొదలుపెట్టిన పరిచర్యను అంటే “కృపా పరిచర్యను” కొనసాగించమని వేడుకుంటాడు. కాబట్టి క్రైస్తవ దాతృత్వం దేవుని దాతృత్వం నుండి వచ్చింది.

## క్రైస్తవ దాతృత్వం దేవుని వరం

“మీరు ప్రతి విషయములో ... అభివృద్ధి పొందునట్లు చూచుకొనుడి” 2 కొరింథీ 8:7

ఆత్మ వరాలను దేవుడు విశ్వాసులందరికీ ఉదారంగా ఇచ్చాడు. అదే సమయంలో అవి కొందరికి ప్రత్యేక వరంగా కూడా ప్రసాదించాడు. ఉదా. అందరికీ సువార్తను చెప్పాలన్నది క్రైస్తవులందరికీ దేవుడిచ్చిన ఆజ్ఞ. అయితే ప్రత్యేకంగా సువార్తికులుగా ఉండే వరం దేవుడు కొందరికే ఇచ్చాడు. అలాగే క్రైస్తవులందరూ దాతృత్వం గలవారిగా ఉండాలన్న నియమం ఉన్నా ఆ వరం మాత్రం కొందరికే ప్రసాదించబడింది. దేవుడు వారికి ఆర్థిక వనరులను విశిష్టంగా అప్పగించిన కారణంచేత అందరి శ్రేయస్సు కొరకు వారికి ఈ బాధ్యతను కూడా అప్పగించారు. కాబట్టి దేవుడు వారికిచ్చిన ఈ ఆర్థిక వనరుల విషయంలో వారు మంచి గృహ నిర్వాహకులుగా ఉండవలసిన వారుగా ఉన్నారు.

## క్రైస్తవ దాతృత్వం క్రీస్తు సిలువ ప్రేరితమైంది

“అజ్ఞానపూర్వకముగా మీతో చెప్పుటలేదు. పరీక్షింపవలెనని చెప్పుచున్నాను.” 2 కొరింథీ 8:8,9.

పౌలు కొరింథీయులను ఉదారంగా ఇవ్వమని ఆజ్ఞాపించడంలేదు. బెదిరించడమూ లేదు. వారి

కి క్రీస్తు కృప తెలుసు కాబట్టి వారి ప్రేమలోని యథార్థతను ఇతరులతో మరిముఖ్యంగా క్రీస్తుతో పోల్చి పరీక్షిస్తున్నాడు.

దేవుని కృప మన జీవితాల్లో పని కలిగి ఉండడమే కాక క్రీస్తు కృప కూడా ఆయనను పోలి ఉండేలా మనలను సవాలు చేస్తుంది(9వ).

మనమాయన దారిద్ర్యం వలన ఐశ్వర్యవంతుల మవ్వాలని మన పేదరికాన్ని బట్టి క్రీస్తు తన ఐశ్వర్యాన్ని విడనాడాడు. దీన్ని మనం పదార్థ సంబంధిత ఐశ్వర్యంగా లేక పేదరికంగా అపార్థం చేసుకోకూడదు. ఆయన నరావతారిగా రావడంలోనూ, మరణాన్ని అనుభవించడంలోనూ యేసుక్రీస్తు దారి ద్ర్యాన్ని మనం చూడగలిగితే, ఆశీర్వాదాలన్నీ నిండుకొని ఉన్న రక్షణను మనకు ప్రసాదించడమే ఆయన ఇచ్చే "ఐశ్వర్యం" అని గ్రహించగలం.

## క్రైస్తవ దాతృత్వం అవసరానికి తగినది

అందును గూర్చి నా తాత్పర్యము చెప్పుచున్నాను... కలిమి కొలది మేము ఇచ్చినది ప్రీతికరమగును" 2 కొరింథీ 8:10-12

కొరింథీలోని క్రైస్తవులు ఇవ్వడంలోనే కాదు ఇవ్వడానికి ఇచ్ఛయించడంలోనూ ప్రప్రథమంగా ఉన్నారు (10వ). వారి ప్రవర్తన వారి ఆశకనుగుణంగా ఉండులాగున వారు తలపెట్టిన కార్యాన్ని సంపూర్తి చేయమని పౌలు చెప్పాడు. అది కూడా వారి కలిమికొలది మట్టుకే జరగాలి (11వ) అన్నాడు.

కాబట్టి క్రైస్తవ్య దాతృత్వం అవసరానికి తగినది. దాతృత్వానికి ముందు ఇవ్వాలనే అపేక్ష ఉంటుంది. అది ఉన్నంత కాలం బహుమతి లేనిదాన్ని బట్టి కన్నా ఇచ్చేవారి కలిమిని బట్టి స్వీకరించబడుతుంది.

## క్రైస్తవ దాతృత్వం సమానత్వానికి తోడ్పడుతుంది

"ఇతరులకు తేలికగానూ మీకు భారముగానూ..... తక్కువగా కూర్చుకొనువారికి తక్కువ కాలేదనియు 2 కొరింథీ 8:13-15

ఇతరులకు భారం తగ్గిద్దామనే ఉద్దేశం చేత వారు భారభరితులవ్వాలని కాదు పౌలు ఉద్దేశం. ఎందుకంటే అలా చేస్తే పరిస్థితిని తారుమారు చేయడమే అవుతుంది. ఒక సమస్యను తీర్చే ప్రయత్నంలో మరొక సమస్యను వారు సృష్టించిన వారవుతారు. అలా గాక అందరూ సమానంగా ఉండాలని పౌలు వివరిస్తాడు. పౌలు చెబుతున్న సమానత్వంలో మూడు అంశాలు ఇమిడి ఉన్నాయి.

మొదటిగా సమానత్వమంటే సమ సమాజం కాదు. ఏదో పరలోకపు ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయినట్టు అందరికీ ఒకే జీతం, ఒకే రకమైన ఇల్లు, ఒకే రకం వస్తువులు కలిగి అన్నీ ఒకేలా ఉండాలని కాదు. దేవుడు మనలను క్లోన్లుగా చేయలేదు. మనం విలువలో, గౌరవంలో, దేవుని స్వరూపంలో సమానంగా చేయబడ్డాం. అయితే ఆకారంలో, వ్యక్తిత్వంలో, స్వభావంలో, సామర్థ్యంలో దేవుడు మనలను విభిన్నమైనవారిగా తయారు చేశాడు.

రెండవదిగా సమానత్వం సమాన విద్యావకాశంతో మొదలవుతుంది. ఎందుకంటే వ్యక్తుల్ని విద్యావంతుల్ని చేయడం వల్ల వారిలో సామర్థ్యాలు పరిపూర్ణంగా ఉపయోగపడి దేవుడు ఉద్దేశించిన స్థితికి వారు చేరుకొంటారు.

మూడవదిగా సమానత్వం అత్యున్నత సామాజిక వ్యత్యాసాన్ని తొలగిస్తుంది. అంటే ఆర్థికపరిస్థితుల వలన వచ్చే వ్యత్యాసాన్ని తొలగిస్తుంది. మనం సహవాసంలో ఒకరి ఇంటికి మరొకరం వెళ్ళకపోవడానికి ఆర్థిక స్థితిగతులే కారణమైనట్లయితే ఈ అసమానత చాలా ఎక్కువేనని చెప్పాలి. దీని పర్యవసానమే సహవాసాల్లో చీలికలు. ఇది పోవాలంటే సమానత్వాన్ని సూచించే కొలబద్ద కావాలి. ఇలాంటి సమానత్వానికి దోహదపడేదే క్రైస్తవ దాతృత్వం.

## క్రైస్తవ దాతృత్వాన్ని జాగ్రత్తగా పర్యవేక్షించాలి

"మీ విషయమై నాకు కలిగిన.... సంఘముల యెదుట కనబరచుడి" 2 కొరింథీ 8:16-24

డబ్బుతో వ్యవహరించడం చాలా ప్రమాదకరమైన విషయం. పౌలుకు ఈ సంగతి బాగా తెలుసు. అందుకే ఆయన "విస్తారమైన ధర్మము విషయమై పరిచారకులమై యున్నాము గనుక దాని గూర్చి మా మీద తప్పుమోపకుండా మేము జాగ్రత్తగా చూచుకొనుచు అతనిని పంపుచున్నాము" (20వ) ఏలయనగా ప్రభువు దృష్టియందు మాత్రమేకాదు మనుష్యుల దృష్టి యందును యోగ్యమైన వాటిని గూర్చి శ్రద్ధగా ఆలోచించుకొనుచున్నాను (21వ). కాబట్టి తాను సరైనది చేయడమే కాక సరియైనది చేస్తున్నట్టు కనబడడంలో కూడా శ్రద్ధ తీసుకున్నాడు.

దీని నిమిత్తం పౌలు తీసుకున్న జాగ్రత్తలు మొదటిగా డబ్బు సంబంధిత వ్యవహారాలు తీతుకు అప్పగించడమే గాక, అతనిని నమ్మాడు కూడా (23వ). రెండవదిగా సంఘాల్లో ప్రసిద్ధి చెందిన సోదరుని అతనితో కూడా పంపుచున్నాను (10వ) అన్నాడు. మూడవదిగా ఈ సోదరుడే ఈ ఉపకార ద్రవ్యము విషయమై పరిచారకులమైన మాతో కూడా ప్రయాణము చేయవలెనని సంఘములవారతని ఏర్పరచుకొనిరి" (19వ) అలా యెరూషలేముకు ద్రవ్యం మోసుకెళ్ళేవారిని సంఘాలవారు నమ్మకత్వాన్ని బట్టి ఎన్నుకొనేవారు. నేటి దినాల్లోనూ ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవడం మంచిది.

## క్రైస్తవ దాతృత్వం కాస్తంత స్నేహపూర్వక పోటీ తత్వాన్ని ప్రోత్సహిస్తుంది.

"పరిశుద్ధుల కొరకైన ఈ పరిచర్యను గూర్చి ... హెచ్చరించుట అవసరమని తలంచితిని" 2 కొరింథీ 9:1-5

కొరింథు సంఘంవారు ఇచ్చుటలో కనబరచిన ఆతృతను గురించి ఫిలిప్పీ సంఘానికి గొప్పగా చెప్తాడు పౌలు. ఇలా చెయ్యడం వలన ఫిలిప్పీ సంఘం వారిని కార్యోన్ముఖుల్ని చేస్తాడు (2వ). కొరింథు, ఫిలిప్పీ సంఘాల వారికి ఒకరి గురించి మరొకరికి చెప్పి వారిలో దాతృత్వాన్ని పురికొల్పడం కోసం పౌలు పోషిస్తున్న పాత్ర ముదావహం ఈ రకంగా మనం ఇతరుల దాతృత్వాన్ని చూసి మరింత దాతృత్వాన్ని కలిగి ఉండవచ్చు.

## క్రైస్తవ దాతృత్వం కోత పంటను తలపిస్తుంది

కొంచెముగా విత్తువాడు..... మీ నీతి ఫలములను వృద్ధి పొందించును" 2 కొరింథీ 9:6-11

ఇక్కడ దాతృత్వానికి సంబంధించిన రెండు నియమాలున్నాయి.

మొదటిగా మనమేది విత్తుతామో అది కోస్తాం. కొంచెంగా విత్తితే కొంచెంగా కోస్తాం. సమృద్ధిగా విత్తితే సమృద్ధిగా కోస్తాం. పౌలు ఇలా రాయడంలో ఆయన ఉద్దేశం మనకు ఖర్చుకు తగిన రాబడి ఉంటుందని కానీ లేక ఎంత ఎక్కువగా ఇస్తే అంత ఎక్కువ పొందుతామని కాదు గానీ ప్రతీవాడూ తాను హృదయంలో నిర్ణయించుకున్నది ఇవ్వాలని, అది సణుగుకోక, బలవంతంగానూ కాక, తాను తిరిగి పొందబోయేదాన్ని అంచనా వేసుకోక ఇవ్వాలి. ఎందుకంటే సంతోషంగా ఇచ్చేవారిని దేవుడు ప్రేమిస్తాడు. (7వ).



రెండవదిగా మనం రెండు ఉద్దేశాలతో కోస్తాం. మొదటిది మనం తినడానికైతే రెండవది మనం తిరిగి విత్తడానికి. ఎందుకంటే పంటనిచ్చే దేవుడు మన ప్రస్తుత ఆకలిని తీర్చడమేకాదు భవిష్యత్‌లో మనకు ఆహారాన్ని దయచేయడంలోనూ శ్రద్ధ కలిగి ఉన్నాడు.

## క్రైస్తవ దాతృత్వానికి ప్రతీకాత్మక ప్రాముఖ్యత ఉంది

క్రైస్తవ దాతృత్వం సాధారణ విషయం కాదుగానీ ఎంతో భావగర్భితమైంది. ఈ విషయాన్ని పౌలు చాలా స్పష్టంగా చెప్పాడు. గ్రీకు సంఘాల విషయానికొస్తే "వారి దాతృత్వం క్రీస్తు సువార్తను అంగీకరించుటకు" (2 కొరింథీ 9:13) గురుతుగా ఉంది. గ్రీకువారి నుండి యూదయ వారికి డబ్బు పోగుచేయడంలో పౌలు ఉద్దేశం కేవలం భౌగోళికమైంది కాదు (గ్రీసు నుండి యూదయకు), లేక ఆర్థిక పరమైంది కాదు (గొప్పవారి దగ్గర తీసుకొని పేదవారి కివ్వాలని), కానీ అంతకంటే ముఖ్యంగా వేదాంత పరమైంది అన్యక్రైస్తవులకు అందాలని. అంటే క్రీస్తు శరీరంలో యూదా - అన్యజనాంగాల ఏకత్వాన్ని సూచించడానికి ఆయన చేసిన ఉద్దేశపూర్వక ప్రయత్నమిది. యూదులు, అన్యజనులు క్రీస్తు శరీరంలో సమాన వారసులు సభ్యులు అన్నది పౌలుకు తెలియజేయబడిన మర్మం, ఈ సత్యం కోసమే పౌలు జీవించాడు. జైలు పాలయ్యాడు.

## క్రైస్తవ దాతృత్వం కృతజ్ఞతా భావాన్ని ప్రోత్సహిస్తుంది

"ఇట్టి ఔదార్యము వలన.... ఆయన వరమును గూర్చి దేవునికి స్తోత్రము" 2 కొరింథీ 9:11-15

ఈ రెండు అధ్యాయాల్లో కూడా నాలుగు సార్లు పౌలు ఈ అర్పణ అంతిమ ఫలితం దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించడంలోనూ ఆరాధించడంలోనూ అంతం అవుతుందని అంటాడు.

- జాన్‌స్టాట్

# క్రిస్మస్‌కి స్పందన



ఎన్నో క్రిస్మస్‌లు మనజీవితంలో వస్తున్నాయి. మనము ఆనందించే ఆ క్రిస్మస్‌లోని అద్భుతమైన సత్యాన్ని గూర్చి ఎప్పుడైనా ఆలోచించామా? ఆలోచిస్తే దానికి విశ్వాసిగా నీ స్పందన ఏంటి? ప్రభువు జన్మించినప్పటి సంగతులను ధ్యానించినప్పుడు క్రిస్మస్ వెనుక ఎన్ని సంగతులు దాగి వున్నాయో గ్రహించగలము. చరిత్రలో ఇది గొప్ప సంఘటన. దేవుడు మానవునిగా మానవులను దర్శించిన గొప్ప శుభవేళ. మానవుడు చంద్రునిపై నడవడం గొప్పకాదు. సమస్తాన్ని సృష్టించిన మహోన్నతుడైన దేవుడు అతి సామాన్య మానవునిగా ఈ భూమిమీద నడవడం గొప్ప కార్యము. మరి ఈ దివ్యమైన క్రిస్మస్ వెనుక ఉన్న ఆధ్యాత్మిక సత్యాలను ఒకసారి ధ్యానించుదామా!

## 1. నిజమైన క్రిస్మస్ - ఆయనను మన జీవితంలో రాజుగా ప్రతిష్టించుకోవడం

మత్తయి 2:2లో జ్ఞానులు "యూదుల రాజుగా పుట్టిన వాడెక్కడ" అని ప్రశ్నించారు. ప్రవక్తలు ఆయన రాజుగా వస్తాడని ప్రవచించారు. మనుష్యులను ఏలునొకడు పుట్టునని దావీదు ప్రవచించాడు. జెకర్యా6:13లో "...అతడు ఘనత వహించుకొని సింహాసనాసీనుడై యేలును...." అని రాయబడింది. జ్ఞానులు ఆ పుట్టిన శిశువును రాజుగా గుర్తించారు. ఆయన నక్షత్రాన్ని వెంబడించి ఎంతో దూరం ప్రయాసతో ప్రయాణించారు. కొంతకాలం ఆయన నక్షత్రము కనబడకపోయినప్పుడు కలత చెందారు. తిరిగి ఆ నక్షత్రము కనబడగానే అత్యానంద భరితులైనారు. ఆ కారణ జన్ముని చూడగానే కలిగిన వారి భక్తిభావాలు వర్ణనాతీతం. సాగిలపడి నమస్కరించారు. వారు తెచ్చిన కానుకలను అర్పించారు. మనల్ని మనం సమర్పించుకోకుండా మనమిచ్చే కానుకలు వ్యర్థం. ఆయన ఆజ్ఞ మేరకు వారు దూత సూచించిన వేరొక మార్గంలో వెళ్ళారు. ఆ రారాజు ఉత్తర్వులకు లోబడ్డారు. మన జీవితంలో క్రీస్తుని ప్రభువుగా ప్రతిష్టించుకొన్నప్పుడే విశ్వాస జీవితములోని మాధుర్యం మనకు అర్థమౌతుంది. ఇటువంటి అనుభవం గల వ్యక్తుల జీవితంలో ప్రతిరోజూ క్రిస్మస్సే.

## 2. నిజమైన క్రిస్మస్ - ఇవ్వడం

దేవుడు తన కుమారుని లోకానికి కానుకగా ఇచ్చాడు. కన్య మరియ నింద భరించడానికి సిద్ధపడింది. ఆనందంతో ఈ వెల చెల్లించడానికి ఆమె సిద్ధపడింది. లూకా 1:48 "నా ఆత్మ నా రక్షకుడైన దేవుని యందు ఆనందించెను". యోసేపు మరియను చేర్చుకోవడానికి వెనుకాడలేదు. మత్తయి 1:24 "యోసేపు నిద్రమేలుకొని ప్రభువు దూత తనకు ఆజ్ఞాపించిన ప్రకారము చేసి తన భార్యను చేర్చుకొని ఆమె కుమారుని కనువరకు ఆమెను ఎరుగకుండెను". దేవుని చిత్తం నెరవేర్చడానికి వారిద్దరు తమ్మునుతాము ఇచ్చివేసుకొన్నారు. విధేయత చూపించారు. బెత్లెహేము ప్రయాణంలో, ఐగుప్తు ప్రయాణంలో, ప్రయాసలను ఆనందంతో భరించారు. లోకరక్షకుని ఆగమనానికి తమ జీవిత ద్వారం తెరిచారు.

## 3. నిజమైన క్రిస్మస్ - కృతజ్ఞత చెల్లించడం

క్రిస్మస్‌కి సంబంధించిన సంఘటనలను గమనిస్తే అందులోని వ్యక్తులందరు దేవుని స్తుతించారు. దూత ద్వారా దేవుని వర్తమానం వినగానే మరియ "నా ప్రాణము ప్రభువును ఘనపరచుచున్నది" అని దేవునిని ఆరాధించినది (లూకా 1:46). లూకా 1:68లో జెకర్యా దేవున్ని స్తుతిస్తున్నాడు. "ప్రభువైన ఇశ్రాయేలు దేవుడు స్తుతింపబడును గాక. ఆయన తన ప్రజలకు దర్శనమిచ్చి, వారికి విమోచన కలుగజేసెను" అని పాడాడు. ఆకాశాన దూతల సమూహం స్తుతులతో గానప్రతిగానాలు చేశారు. "సర్వోన్నతమైన స్థలములలో దేవునికి మహిమయు ఆయనకిష్టులైన మనుష్యులకు భూమిమీద సమాధానము కలుగును గాక" అని దేవునిని ఆర్భాటంతో స్తుతించుచూ పాడారు. మరి మన జీవితాలు ఆ స్వచ్ఛమైన స్తుతి ఆరాధనతో నిండి ఉన్నాయా?

### 4. నిజమైన క్రిస్మస్ - సాక్ష్యమివ్వడం

గొర్రెల కాపరులు దూత చెప్పినట్లు "... బెత్లెహేముకు వెళ్ళి మరియను యోసేపును తొట్టిలో పండుకొనియున్న శిశువును చూచి, ఈ శిశువును గూర్చి తమతో చెప్పబడిన మాటలు ప్రచురము చేసిరి...విన్నవారు మిక్కిలి ఆశ్చర్యపడిరి ". గొర్రెల కాపరులు వినిన దానిని, చూచిన దానిని, అనుభవించినదానిని ఇతరులతో పంచుకొన్నారు. బాప్తీస్మమిచ్చే యోహాను - ఆ వెలుగును గూర్చి సాక్ష్యమిచ్చుటకే వచ్చానని (యోహాను 1:8) చెప్పాడు. అనుదినం మన పెదవుల ద్వారా ఆయనను గూర్చి సాక్ష్యమివ్వాలి. ఆశ్చర్యపరచే మన సాక్ష్యం అనేకులను ప్రభావితులను చేయాలి.

### 5. నిజమైన క్రిస్మస్ - మిషన్స్ పట్ల ఆసక్తి కలిగి ఉండడం

ప్రభువైన యేసుక్రీస్తు ఒక మిషనరీగా ఈ లోకానికి వచ్చారు. ఆయన మహిమను వీడి, పరలోకాన్ని వదిలి భూమిపైకి మానవునిగా వచ్చాడు. మనలను దేవునితో సమాధానపరచి - ప్రేమలో, ఆత్మలో నిత్యం మనతో ఉండాలనే తన దయాపూర్వక సంకల్పాన్ని ఆయన నెరవేర్చాడు. మరి నీవు ఆయన సువార్తను అందించడానికి సౌకర్యాలు వదిలి సుఖవలయం నుండి కఠినమైన ప్రదేశాలకు వెళ్ళడానికి ఇష్టపడుతున్నావా? ఏ విధంగా ఈ క్రిస్మస్ చేసుకోదలచావు?

– యం.యస్.రవికుమార్, నెల్లూరు

## దేశ నివాసుల మీద – వెలుగు ప్రకాశించే

ఆదికాండము నందు - ఆది దేవుడు
అపవాదికి - ఆజ్ఞాపించినట్లు
అపవాదికిని - స్త్రీ సంతానమునకు
వైరము కలుగజేసె
ఆదాము - దోషమునకు
అడ్డు పడుటకై - అరుదెంచె అవనిపైకి
స్త్రీ సంతానమైన - యేసు ప్రభు
కడపటి ఆదాముగా - జన్మించె ఇలలో
దేశములపై - కమ్మియున్న
కారుమబ్బులను - తొలగించుటకు
మరణచ్ఛాయగల - గలలియను
మహిమగలదానిగా - చేయుటకు
భూమితట్టు - తేరి చూడగా
బాధలు - అంధకారము ఆవరించె
భూ ప్రజలు - చీకటిలో నడుచుచుండె కావున
భూమండలానికి - భగవంతుడు వచ్చియుండె
మనకు కుమారుడు - అనుగ్రహింపబడెన్
ప్రభువు మహిమ - దిగివచ్చె
ప్రకాశించె పొలములో - గొఱ్ఱెల కాపరుల చుట్టూ
సమాధానకర్త - సశరీరుడై
బెత్లెహేము ఎఫ్రాతా
యూదా ప్రధానులలో– నీవు
ఎంతమాత్రము - అల్పమైనదానవు కావు
యూదా ప్రజలను ఏలబోవువాడు
ప్రవచనసారంగా నీలోనుండి వచ్చును
ప్రభువు దూత - ప్రకటన మార్మోగుచుండె
ఇదిగో - ఆనందం
ఇదిగో - సంతోషం
ఇదిగో - సువార్తమానం
ఇదిగో - నక్షత్రం
ఇదిగో - దావీదు పట్టణం
ఇదిగో - బెత్లెహేము
యూదుల రాజుగా పుట్టినవాడెక్కడ?
తూర్పు దేశపు జ్ఞానుల
రాజైన హేరోదునకు సూటి ప్రశ్న
ప్రధాన యాజకులు, శాస్త్రులు
పరిశుద్ధ గ్రంథమును
పరిశోధించి - ప్రకటించె
యూదా బెత్లెహేములోనే
అని నిర్ధారించె
మెస్సీయా - మహినుద్భవించె
మృత్యు భీతిని - తొలగించె
సర్వోన్నత స్థలములలో - దేవునికి మహిమ
సమాధానము - ఆయన కిష్టులైన వారికి
దూతగణముల - గాన ప్రతిగానములను
వ్యాపించుచుండె - వినబడుచుండె
బెత్లెహేము నుండి
భూదిగంతాల వరకు
రక్షకుని యొద్దకు
రండి... రారండి...



– సిహెచ్. ఎలీషా, నర్సరావుపేట

ప్రత్యేకం



# దైవమానవుడైన క్రీస్తు

యేసుక్రీస్తు దైవమానవునిగా ఈ లోకానికి రక్షణను తీసుకొని వచ్చిన శుభదినమే క్రిస్మస్. ఈ సందర్భంగా ఆయన దైవమానవత్వం గూర్చి సిద్ధాంతపరంగా తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతో మనకు ఉంది. ఎందుకంటే ఆయన వ్యక్తిత్వాన్ని గూర్చిన తప్పుడు సిద్ధాంతాలు కొన్ని ఉన్నాయి. ఇవి ఆయన వ్యక్తిత్వం గూర్చిన అవగాహనలోపం ద్వారా ఏర్పడిన తప్పుడు అభిప్రాయాలు. యేసుక్రీస్తు వ్యక్తిత్వంలో దైవ మానవ స్వభావాలు ఏకమై ఉన్నాయి. ఇమిడి ఉండటం కాదు, మిశ్రమమై ఉండడం కాదు గానీ ఏకమై ఉన్నాయి. ఈ దైవమానవునిలోని దేవ, మానవ స్వభావాలు ఏక కాలములోనే ఏకమైన మర్మాన్ని అర్థం చేసుకోవడంలో ఉండే సంక్లిష్టతను బట్టి బేధాభిప్రాయాలు, తప్పుడు నమ్మకాలు, బోధలు ఏర్పడ్డాయి.

యేసుక్రీస్తు వ్యక్తిత్వంలో ఏకమై ఉన్న దైవ మానవ స్వభావాలు గూర్చిన విషయాన్ని హైపోస్టాటిక్ - యూనియన్ అంటారు. అభౌతిక, భౌతిక ఏకత్వంను హైపోస్టాటిక్ యూనియన్ అనవచ్చు. ఇది ఒక మర్మము.

## మొదటి శతాబ్దంలో...

యేసుక్రీస్తు దైవమానవత్వాన్ని అర్థం చేసుకోవడంలో మొట్టమొదటి శతాబ్దంలోనే తప్పుడు సిద్ధాంతాలు ఏర్పడ్డాయి. యేసుక్రీస్తు శరీరధారి కాదు ఆయన ఆత్మ అనే సిద్ధాంతాన్ని అపోస్తలుడైన యోహాను తన పత్రికలో ఖండిస్తూ వచ్చాడు. యేసుక్రీస్తు శరీరధారియై వచ్చెనని ఏ ఆత్మ యేసును ఒప్పుకొనునో అది దేవుని సంబంధమైనది. ఏ ఆత్మ ఒప్పుకొనదో అది దేవుని సంబంధమైనది కాదని రాశాడు (1 యోహాను 4:2)

## సంఘ చరిత్రలో

సంఘ చరిత్రలో మొట్టమొదటిసారి యేసుక్రీస్తు దైవ మానవ స్వభావాల యథార్థత, పరిపూర్ణత స్థాపించబడిన తరువాత (నైసియా కౌన్సిల్,ఎడి 325, కాన్‌స్టాంట్ నోపుల్, ఎడి 381) ఆ రెండు స్వభావాల మధ్య గల సంబంధం గూర్చి ఆలోచించడం జరిగింది. ఆయన పరిపూర్ణ మానవుడు మరియు పరిపూర్ణ దేవుడు ఒకేసారి ఎలా అవుతాడో గ్రహించలేక ఆ మర్మాన్ని వివరించడానికి చేసిన ప్రయత్నంలో వచ్చిన కొన్ని తప్పుడు సిద్ధాంతాలను సంఘం తిరస్కరించింది. అవి కింద ఇవ్వబడ్డాయి.

### 1. అపొల్లొనేరియనిజం

అపొల్లొనేరిస్ క్రీశ 361లో లవొదికయకు బిషప్ అయ్యాడు. ఆయన యేసుకు శరీరం ఉంది, ఆయనకు మానవ మనసు, మానవ ఆత్మ లేదు. ఆయనకున్న మనసు, ఆత్మ పైనుంచి వచ్చింది. అది

దేవుని త్రిత్వంలో కుమారునిదని బోధించాడు. ఈ బోధను ఆదిమ సంఘం తిరస్కరించింది. దేవుడిచ్చే రక్షణ కేవలం మన శరీరానికి మాత్రమే కాదు, మన మనసు, ఆత్మ కూడా విమోచించబడాలి అని వారు గ్రహించి ఈ బోధను తిరస్కరించారు. మనము రక్షించబడాలంటే క్రీస్తు పరిపూర్ణమైన మానవుడు మరియు దేవుడు అవ్వాలి (హెబ్రీ 2:17). క్రీశ 362 నుండి క్రీశ 381లలో జరిగిన అన్ని కౌన్సిల్స్ ఈ తప్పుడు బోధను తిరస్కరించాయి.

### 2. నెస్టోరియనిజం

ఈ సిద్ధాంతం ఐదవ శతాబ్దానికి సంబంధించినది. అంతియొకయలోని ప్రముఖ ప్రసంగీకుడు, కాన్‌స్టాంట్ నోపుల్ సంఘ బిషప్ అయిన నెస్టోరియన్ ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఈయన అభిప్రాయం ప్రకారం, దేవునికి తల్లి ఉండదు. భూమి మీద సృష్టించబడ్డ ఏ జీవి కూడా త్రిత్వంలో ఒకరైన యేసును ఉత్పత్తి చేయలేదు. కాబట్టి మరియ దేవునిని కనలేదు. దేవుడు ఆమెను ఒక సాధనంగా వాడుకొన్నందున ఒక మానవుని మాత్రమే కన్నది అని చెప్పాడు. ఆ తర్వాత నెస్టోరియన్ దైవమానవ స్వభావాల ఏకత్వాన్ని ఒప్పుకొన్నప్పటికీ ఏకత్వం (యూనియన్) కంటే కలయికను (కన్‌జంక్షన్) ఎంచుకొన్నాడు. ఉద్దేశపూర్వకంగా ఈ భావన ఎంచుకొననప్పటికీ ఇది యేసుని దైవ, మానవ అని ఇద్దరు వ్యక్తులుగా చీలిక తీసుకొనిరావడం వల్ల తప్పుడు బోధగా పరిగణించబడి క్రీశ 431లో ఎఫెసీలో జరిగిన సంఘ కౌన్సిల్ చేత తిరస్కరించబడింది.

### 3. యూటికీయనిజం

యూటికస్ (375-454 క్రీశ) ఈ సిద్ధాంతాన్ని బోధించాడు. యేసు పుట్టిన తర్వాత ఆయన ఒకే స్వభావాన్ని కలిగి ఉన్నాడని ప్రకటించాడు. అదేంటంటే దేవుడు మానవుడుగా మారిపోయాడని, ఆయన దైవ, మానవ స్వభావాలు లేఖన విరుద్ధమని ప్రకటించి యేసు కన్యకకు జన్మించాడనే విషయాన్ని సమర్థించాడు. ఆయన బోధలోని వివాదం, యేసు నరావతారానికి ముందు రెండు స్వభావాలు కలిగి ఉన్నాడని చెబుతూ, జన్మకు ముందు దేవుడుగా, జన్మించిన తరువాత మానవుడుగా ఉన్నాడని చెప్పి ఆయన గందరగోళానికి గురయ్యాడు.

ఈయన అభిప్రాయాలతో ఒక ఉద్యమం ఏర్పడి యేసు మానవత్వం దైవత్వంలోనికి శోషించబడి అది పూర్తిగా శూన్యమయిపోయిందని బోధించింది. యూటికీయనిజం డొసిటిజం యొక్క ఒక రూపంగా చెప్పవచ్చు. డొసిటిజం అంటే యేసుకు సహజమైన లేక వాస్తవమైన దేహం లేదు ఆయన మానవుడుగా కనిపించాడు అంతే.

యేసు మానవత్వం, దైవత్వం కలసిపోయి మరొక మిశ్రమ వ్యక్తిత్వం (హైబ్రిడ్ సబ్‌స్టాన్స్) కలిగి ఉన్నాడనే బోధను ఈయన విశ్వసించాడు. ఇది కూడా తిరస్కరించబడింది.

యేసు దైవ మానవ ఏకత్వాన్ని పరిష్కరించడానికి మరో రెండు ప్రయత్నాలు జరిగాయి. వాటిలో మొదటిది అడాప్టిజమ్, రెండవది కెనోటిజం.

### 1. అడాప్టిజమ్ (దత్త స్వీకారం)

నజరేయుడైన యేసు తొలినాళ్ళలో కేవలం మానవుడుగా ఉన్నాడు. యేసు బాప్తీస్మము పొందినపుడు దేవుడు ఆయనను కుమారునిగా దత్తత చేసుకొన్నాడు. ఈ అభిప్రాయం మానవుడు దేవుడు అవ్వడం అనే వివాదానికి దారితీస్తుంది. దత్తత సిద్ధాంతాన్ని నమ్మేవారు యోహాను 3:16 వాక్యభాగాన్ని మద్దతుగా ఉపయోగిస్తారు (ఆయన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు అనే భావాన్ని మద్దతుగా ఉపయోగించుకొంటారు). బైబిల్ మొత్తం అవగాహనతో ఈ అభిప్రాయాన్ని పోల్చినప్పుడు ఇది తప్పని మనకు తెలుస్తుంది. సృష్టికి ముందే ఉన్న యేసుక్రీస్తు ఉనికిని, ఈ అభిప్రాయం వ్యతిరేకిస్తుంది. అంతేకాకుండా పరిశుద్ధాత్మ వలన యేసు కన్య మరియకు జన్మించాడనే సత్యానికి విరుద్ధంగా మాట్లాడుతుంది. మన రాష్ట్రంలో ఒక ప్రముఖ బోధకుడు ఈ సిద్ధాంతాన్ని నమ్మి ముస్లిం బోధకుల ముందు ఆయన దైవత్వాన్ని కించపరిచాడు.

### 2. కెనోటిజం (రిక్తుడుగా చేసుకోవడం) ఫిలిప్పీ 2:7

త్రిత్వంలో ఉన్న రెండవ వ్యక్తియైన యేసు దైవ లక్షణాలైన సర్వశక్తి, సర్వవ్యాపి, సర్వజ్ఞానం ప్రక్కకు పెట్టేసి మానవ లక్షణాలను తీసుకొన్నాడు. దాని ఫలితం ఆయన నరావతారం వద్ద ఆయన దైవస్వభావం కొంత మార్పు చెందింది. ఆయన

నైతిక లక్షణాలైన ప్రేమ, నీతి, న్యాయం, కనికరము అలాగే ఉన్నాయి. కెనోటిజం యేసు ఒకేసారి దేవుడు మానవుడు కాదు అని విశ్వసిస్తుంది. కానీ వరుసగా దేవుడు మానవుడు అని నమ్ముతుంది. కొన్ని లక్షణాలను బట్టి ఆయన దేవుడు, తరువాత మానవుడు ఆపై దేవుడు. ఈ అభిప్రాయం కొన్ని విషయాలను పరిష్కరించడంలో సఫలమవుతుంది గాని బైబిల్ రచయితలు రాసినట్లు ఆయన ఒకేసారి దేవుడు, మానవుడు అన్న విషయానికి విరుద్ధంగా ఉంటుంది.

### యేసుక్రీస్తును గూర్చి నాలుగు తప్పుడు బోధలు

1. ఎబియోనిజం: యేసు దేవుడు కాదు
2. ఏరియనిజం: యేసు పూర్తిగా దేవుడు కాదు కొంచెం తక్కువ.
3. డోసిటిజం: యేసు మానవుడు కాదు. మానవుడుగా కనిపించాడు అంతే.
4. అపొల్లోనేరియనిజం: యేసు పూర్తిగా మానవుడుకాదు.

### ఒక వ్యక్తిత్వం రెండు స్వభావాలను గూర్చి తప్పుడుబోధ

1. నెస్టోనేరియనిజం: యేసు ఇద్దరు భిన్నమైన వ్యక్తుల మిశ్రమం
2. యూటికీయనిజం: యేసు రెండు స్వభావాల సమ్మిళితం లేక మిశ్రమం

### బైబిల్ ఏమి బోధిస్తుంది?

యేసు నరావతారిగా రావడం అంటే దైవత్వం విడిచిపెట్టడం లేక కోల్పోవడం కాదు గానీ మానవత్వాన్ని ఆపాదించుకోవడం. ఇదే విషయం మనకు రెండుచోట్ల బైబిల్‌లో స్పష్టంగా రాయబడింది.

1. కొలస్సీ 2:9: దేవత్వము యొక్క సర్వపరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించుచున్నది.

2. హెబ్రీ 10:5: బలియు అర్పణయు నీవు కోరలేదు గాని నాకొక శరీరమును అమర్చితివి.

యేసు నరావతారిగా వచ్చినప్పుడు దేవత్వమును విడిచిపెట్టలేదు గాని నరావతారిగా ఉన్న కాలానికి ఆయన విధి నిర్వహణలో భాగంగా తండ్రికి లోబడ్డాడు. యేసు విధి నిర్వహణ మన కోసం ప్రాయశ్చిత్తం చేయడమే.


యేసు బాల్యం నుండి నేను మెస్సీయను, తండ్రి పని మీద వచ్చాను అనే స్పృహ కలిగి ఉన్నాడు. యెరూషలేములో తప్పిపోయినప్పుడు, వారి తల్లిదండ్రులు ప్రశ్నించినప్పుడు నేను నా తండ్రి పనుల మీద ఉండాలి కదా అని చెప్పాడు. చాలాసార్లు నేను పరలోకం నుండి వచ్చాను అని, పరలోకానికి వెళతాను (తండ్రి దగ్గరకు) అని చెప్పడం దీనిని సమర్థిస్తుంది.

ఆయనకు మానవ స్పృహ కూడా ఉంది. చాలాసార్లు తనను తాను మనుష్యకుమారునిగా పరిచయం చేసుకొన్నాడు. తనను తాను దేవుని కుమారునిగా, మనుష్యకుమారునిగా బాల్యం నుండే భావించాడు. కాలక్రమేణా వచ్చిన స్పృహకాదిది. అయితే యేసు తన్ను తాను ప్రత్యక్ష పరచుకోవడం లేక బయలు పరచుకోవడం కాలక్రమేణ జరిగిందంతే. దీనికి ఆయన జీవితంలో జరిగిన రెండు ప్రాముఖ్యమైన విషయాలను గమనించవచ్చు. ఒకటి కొండమీద రూపాంతరం చెందడం, రెండవది, పేతురు వచ్చి నీవు సజీవుడవైన దేవుని కుమారుడవు అని చెప్పడం. తర్వాత మనుష్యకుమారుడు చనిపోయి, మూడవ దినాన లేవవలసి ఉందని మరణ, పునరుత్థానాన్ని, మిషన్‌ను బయలుపరచుకొన్నాడు.

యేసు తన తండ్రితో ఏకమై ఉన్నాడని, తాను మెస్సీయ్య, దేవుని కుమారుడు, ప్రభువు, మనుష్య కుమారుడు అని బయలుపరచుకోవడం ఆయన మూలాన్ని, ఉనికిని, అస్థిత్వాన్ని, స్పృహను తెలియజేస్తాయి.

యేసు నరావతారిగా మారినప్పుడు ఆయన దైవలక్షణాలు ఏమీ పోగొట్టుకోలేదు గానీ తనంతట తాను పరిమితులు విధించుకొని వాటిని మరుగు చేసుకొన్నాడు. దైవలక్షణాలు ఆయనకు ఉండి మరలా పోయేవి లేక కోల్పోయేవి కాదు. తిరిగి మరలా వచ్చేవి కావు. యేసుక్రీస్తుకు రెండు చిత్తాలు, రెండు స్పృహలు, రెండు స్వభావాలు (దైవ,మానవ) ఉన్నాయి. అయితే ఈ రెండు స్వభావాలు ఒకే వ్యక్తిత్వంలో ఏకమై ఉన్నాయి. ఆయన మానవచిత్తం ఎల్లప్పుడూ తండ్రికి లోబడుతూ పరిశుద్ధాత్మ చేత నడిపించబడుతూ ఉన్నది.

యేసుక్రీస్తు స్వభావంపై ఏర్పడిన తప్పుడు సిద్ధాంతాలను తిప్పి కొట్టడానికి ఏడి 451లో కాల్సిడోనియన్ కౌన్సిల్ కాన్‌స్టాంట్‌నోపిల్‌లో (నేటి ఇస్తాంబుల్) థియలాజియన్స్ ఒక డిక్లరేషన్




ప్రతిపాదించారు. ఇది అపొల్లొనేరియనిజమ్, నెస్టోరియనిజమ్, యూటికీయనిజమ్ మొదలైన తప్పుడు సిద్ధాంతాలను ఖండించింది. ఈ డిక్లరేషన్ అన్ని సంఘాలకు (కేథలిక్, ప్రొటస్టంట్స్, ఆర్థోడాక్స్) ప్రామాణికంగా ఎంచబడుతుంది. యేసు నూటికి నూరుపాళ్ళు దేవుడు మరియు మానవుడు, తండ్రితో సమానుడు. ఆయనలో రెండు స్వభావాలు ఏకమై ఉన్నాయి. ఆ స్వభావాలు విడదీయలేనివి మారనివి. ప్రతి స్వభావం యొక్క లక్షణాలు ఎప్పటికీ అలానే ఉంటాయి. అలాగే యేసు తండ్రితో త్రిత్వములో ఏకమై ఉంటూ తాను ధరించుకొన్న మానవ స్వభావాన్ని ఎన్నటికీ కొనసాగిస్తాడు.

## యేసు ఎన్నటికీ తన మానవ స్వభావాన్ని కొనసాగిస్తాడు

యేసు పునరుత్థానుడైన తర్వాత తన మానవ స్వభావాన్ని వదలిపెట్టలేదు, దానిని ఆయన కొనసాగించాడు. ఆయన తన గాయాలను శిష్యులకు చూపించాడు. వారు చేప ముక్కను ఇచ్చినప్పుడు దానిని తిన్నాడు. దూతలు ఈ యేసే తిరిగి వస్తాడని శిష్యులకు చెప్పారు. స్తెఫను హింసించబడుతున్నప్పుడు మనుష్యకుమారుడు నిలువబడి ఉండడం చూశాడు. సౌలుతో నేను నీవు హింసించుచున్న యేసును అని పరిచయం చేసుకొన్నాడు. అపోస్తలుడైన యోహాను ప్రకటన గ్రంథంలో మనుష్యకుమారుని పోలిన ఒకనిని చూశాడు (యోహాను 20:26-27, లూకా 24:41-42). యేసు శిష్యులకు కనిపించినప్పుడు నాకు ఉన్నట్లు యెముకలు, మాంసము భూతానికి ఉండవని చెప్పాడు. కాబట్టి యేసు నిరంతరం దైవమానవునిగా పరలోకంలో కొనసాగుతాడు. ఆయన త్రిత్వంలోనికి మహిమపరచబడ్డ మానవత్వాన్ని తీసుకొనిపోయాడు. ఇది పతనమైన మానవత్వం కాదు గాని పతనానికి ముందు ఆదాము, హవ్వలకు ఉన్న మానవత్వం.


## ముగింపు

యేసు నరావతారం మన పాప ప్రాయశ్చిత్తం కోసమే (హెబ్రీ 2:14-17). యేసు తండ్రిని పరిచయం చేయడానికి, పరలోకంను గూర్చి పాపుల పట్ల దేవుని ప్రేమను తెలియజేయడానికి, తండ్రి మిషన్ (యోహాను17) నెరవేర్చడానికి వచ్చాడు. కాబట్టి మనం కూడా ఈ మిషన్‌లో పాల్గొనాలి. పశ్చాత్తాపము ద్వారా, రక్షణ పొంది ప్రజలు నిత్యరాజ్యంలో ప్రవేశిస్తారు కాబట్టి సువార్త ప్రకటించాలి.

నిత్యమైన వాక్యంగా ఉన్న యేసు శరీరధారియై మరణాన్ని చవి చూశాడు. ఆయన మానవత్వంలో పాలుపంచుకోవడం ద్వారా మన సహోదరుడు అయ్యాడు. అందువల్ల జీవితకాలం మరణభయం నుండి మనలను విడిపించడానికి, సాతాను క్రియలు లయం చేయడానికి, మనకు విమోచన అనుగ్రహించడానికి మన పాపాల కోసం బలి అవ్వడమే కాకుండా మనలను నీతిమంతులనుగా తీర్చి, మహిమపరచడానికి ఆయన నరావతారం మనకు సహాయం చేసింది. ఆయన మనలాంటి శోధనల గుండా, శ్రమల గుండా వెళ్ళాడు కాబట్టి మనలను అర్థం చేసుకోగలడు, సహాయపడగలడు.

ఆయన రాజుగా వచ్చి పరలోక రాజ్యమును గూర్చి ప్రకటించాడు. క్రొత్తగా జన్మిస్తేనే తప్ప ఆయన రాజ్యంలోకి ఎవరూ ప్రవేశించలేరు. కాబట్టి, ఆయన రాజ్య సువార్తను ప్రకటించాలి, ఆయన రాజ్య విస్తరణకు పాటుపడాలి, పనిచేయాలి, శ్రమను హింసను భరించాలి. క్రీస్తు సువార్త వల్ల కలిగే పశ్చాత్తాపం, మారుమనస్సు ద్వారానే ఆయన రాజ్యం నిర్మితమవుతుంది. ఈ క్రిస్మస్ పర్వదినాల్లో సువార్త ప్రకటించడం ద్వారా ఆయన రాజ్య విస్తరణకు పాటుపడడానికి ప్రతిష్టించుకొందాం, రెండవ రాకడకు సిద్ధపడదాం.

**– జి. జెర్మియా ప్రసాద్,** నంద్యాల
ఏపి-ఇజియఫ్ స్టాఫ్




# యెహోవా సాక్షులు

"ప్రతీ యుద్ధం మోసం మీదే ఆధారపడి ఉంటుంది" అని అంటాడు ప్రాచీన చైనా దేశ సైనిక వ్యూహకర్త. ప్రజల్ని మోసపుచ్చడం సాతాను వాడే యుద్ధ తంత్రాలలో భాగం (ఆ.కా. 3:13; 2 కొరింథీ 2:11). అందుకే గొర్రె చర్మం వేసుకొని వచ్చే తోడేళ్ళ లాంటి అబద్ధ ప్రవక్తల విషయమై జాగ్రత్తపడమని యేసుక్రీస్తు హెచ్చరించారు (మత్తయి 7:15). సంఘ ప్రారంభ దినాలనుండే మోసపుచ్చే అబద్ధ ప్రవక్తలు, అబద్ధ బోధకులు ప్రజలలో ఉన్నారు (2 పేతురు 2:1), గనుక ప్రతీ ఆత్మను నమ్మక ఆ యా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించమని లేఖనం మనలను ఆజ్ఞాపించింది (1 యోహాను 4:1). "పౌలు ప్రకటించిన సువార్త కాక వేరొక సువార్త ప్రకటించిన వాడు శాపగ్రస్తుడు అని తీవ్ర స్వరంతో హెచ్చరించడానికి కారణం వేరొక సువార్తను ప్రకటించడం వ్యక్తుల నిత్య భవితవ్యాన్ని, క్రీస్తు మహిమను పణంగా పెట్టడమే" అని అంటాడు జాన్ స్టాట్ (గలతీ 1:8).[1] అపోస్తలులు ప్రకటించిన యేసును, సువార్తను కాకుండా నకిలీ యేసుని గురించి, నకిలీ సువార్తను ప్రకటించే నకిలీ ప్రవక్తలు నకిలీ రక్షణకు కారకులవుతారు. అందుకే ఇలాంటి నకిలీ క్రైస్తవ్యాల పట్ల నిర్లక్ష్యం వహించడం ప్రమాదకరం. పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగించిన బోధ నిమిత్తం పోరాడడం ప్రతి సగటు క్రైస్తవుని బాధ్యత (యూదా 3).

క్రైస్తవులమని చెప్పుకుంటూ ప్రత్యక్షంగానో పరోక్షంగానో బైబిల్ బోధిస్తున్న అత్యంత ప్రధాన సిద్ధాంతాలను తిరస్కరిస్తూ ప్రత్యేకమైన సిద్ధాంత పంథాను అనుసరించే వ్యక్తులను, వర్గాన్ని, సంస్థను "నకిలీ క్రైస్తవ్యం" గా నిర్వచిస్తారు అలెన్ గోమ్స్.[2] ఈ నకిలీ క్రైస్తవ మతాలన్నీ వాళ్ళ సిద్ధాంతాలకు బైబిలే పునాది అని పైకి చెప్పినప్పటికీ, బైబిల్ వాక్య భాగాల ను వివరించడానికి/భాష్యం చెప్పడానికి మాత్రం వాళ్ళ నాయకుడు/సంస్థదే అంతిమ అధికారంగా చెబుతారు. బైబిల్‌ను వక్రీకరించి తమ సిద్ధాంతాలకు అనుకూలంగా కనిపించే వాక్య భాగాలను ప్రత్యేకంగా ఎంచుకోవడంలో తమ సభ్యులకు తర్ఫీదునిస్తారు.

రాజీ పడడానికి అవకాశమేలేని అత్యంత ప్రధాన బైబిల్ సిద్ధాంతాలను నార్మన్ గైజ్లర్ గుర్తించారు: 1.దేవుని ఏకత్వం 2. దేవుని త్రియేకత్వం 3. మానవుని పతనావస్థ 4.యేసు మానవత్వం 5.యేసు సంపూర్ణ దైవత్వం 6. యేసు పాపరాహిత్యం 7. యేసు ప్రాయశ్చిత్త మరణం 8. దేవుని కృప ఆవశ్యకత 9.విశ్వాస ఆవశ్యకత 10.యేసు శరీర

**"విషం అయితే అప్పటికప్పుడే ప్రభావం చూపుతుంది, కానీ తప్పుడు బోధ చాలా కాలం ప్రభావం చూపిస్తుంది" - జాన్ ముర్రే.**

పునరుత్థానం.[3] వీటిలో ఏ సిద్ధాంతాన్ని తిరస్కరించినా వాళ్ళు బైబిల్ బోధిస్తున్న ప్రధాన సిద్ధాంతాలను వక్రీకరిస్తూ, సనాతన క్రైస్తవ సంఘ విశ్వాస సూత్రాల నుండి తొలగిపోవడమే.

క్రైస్తవులను గలిబిలి చేయడానికి అసత్యంతో మోసగించడానికి "నకిలీ క్రైస్తవ్యాలు" పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న తరుణంలో మనం పరిచర్య చేస్తున్నాం. ఈ నకిలీ క్రైస్తవులు ఉభయ తెలుగు రాష్ట్రాలలో కళాశాల విద్యార్థులను సయితం గందరగోళానికి గురిచేస్తున్నారన్నది వాస్తవం. ప్రపంచంలో ప్రస్తుతం అత్యంత వేగంగా విస్తరిస్తున్న ఇలాంటి నకిలీ క్రైస్తవ మతాలలో "యెహోవా సాక్షులు" ఒకటి. అసలు ఎవరు ఈ "యెహోవా సాక్షులు"? వాళ్ళ బోధ గురించి, వాళ్ళ సాహిత్యం గురించి, వాళ్ళు వక్రీకరించే బైబిల్ వాక్య భాగాల గురించి పరిచయం చేసే ప్రయత్నమే ఈ వ్యాసం.

### 1. యెహోవా సాక్షులు ఎవరు?

'యెహోవా సాక్షులు' అనే నకిలీ క్రైస్తవ మతానికి ఆద్యుడు ఛార్లెస్ తేజ్ రస్సెల్ (1852-1916). ఈయన ఫిబ్రవరి 16, 1852 సంవత్సరం అమెరికా దేశంలో జన్మించాడు. ఆయన తల్లిదండ్రులు ప్రెస్బిటేరియన్ సంఘానికి చెందిన వాళ్ళు. రస్సెల్ తన 18 ఏళ్ళ వయస్సులో 1870వ సంవత్సరం పిట్స్‌బర్గ్ ప్రాంతంలో ఒక బైబిల్ తరగతిని నిర్వహించడం ప్రారంభించాడు. ఆ గుంపు ఆయనను 1876వ సంవత్సరంలో పాస్టర్‌గా నియమించారు. అడ్వెంటిస్ట్ బోధకుడు నెల్సన్ బార్బర్ బోధనలు రస్సెల్‌ను చాలా ప్రభావితం చేశాయి. తొలి దినాల్లో అవిశ్వాసులు పొందే 'నిత్య శిక్ష', విశ్వాసుల పట్ల దేవునికున్న 'అనాదికాల ఎన్నిక' లాంటి సిద్ధాంతాలను తిరస్కరించడం మొదలు పెట్టాడు. 1879వ సంవత్సరంలో Zion Watch Tower and Herald of Christ's Presence అనే పత్రిక ప్రారంభించాడు. తర్వాత అది ప్రస్తుతం ఉన్న "Watchtower Magazine" గా మార్పు చెందింది. తరువాత 1881వ సంవత్సరంలో "Zion's Watch Tower Tract Society" ను స్థాపించడం జరిగింది, అదే ఇప్పుడు "వాచ్ టవర్ బైబిల్ అండ్ ట్రాక్ట్ సొసైటీ" పేరున కొనసాగుతుంది. రస్సెల్ 1904వ సంవత్సరంలో తన దేవశాస్త్రాన్ని (Theology) ఆరు పుస్తకాల సంపుటి అయిన "స్టడీస్ ఇన్ స్క్రిప్చర్స్" లో గ్రంథస్తం చేశాడు. రస్సెల్ చనిపోయిన తరువాత 1916వ సంవత్సరంలో జోసెఫ్ ఫ్రాంక్లిన్ రూథర్ ఫర్డ్ (1869-1942) 'కావలి కోట' సంస్థకు అధ్యక్షుడయ్యాడు. ఆయన కాలంలోనే 'కావలి కోట' సభ్యులను "యెహోవా సాక్షులు"గా పిలవడం ప్రారంభమయ్యింది. తరువాత అధ్యక్షుడైన నాతన్ నార్ (1905-1977) కాలంలోనే యెహోవా సాక్షుల సిద్ధాంతాలకు అనుకూలంగా ఉండే విధంగా తమకంటూ బైబిల్‌ను వక్రీకరించిన ప్రత్యేక తర్జుమాను (New World Translation) తయారు చేసుకున్నారు. "కావలి కోట తప్పుడు బోధలకు అనుకూలంగా ఉండడం కోసం బైబిల్‌లోని కొన్ని కీలక భాగాలైన యోహాను 1:1; ఫిలిప్పీ 2:6; తీతుకు 2:13; 2 పేతురు 1:1; ప్రక 3:14; సామెతలు 8:22లను వక్రీకరించి తర్జుమా చేశారు" అని అంటారు ప్రఖ్యాత బైబిల్ పండితుడు బ్రూస్ మెట్జగర్.[4]

### 2. యెహోవా సాక్షుల సిద్ధాంతాలు

కావలి కోట వక్ర బోధలోని కొన్ని ముఖ్య సిద్ధాంతాలు

**ఎ. కావలి కోట:** కావలి కోట సంస్థ మాత్రమే దేవుడు భూమిమీద స్థాపించిన దేవుని స్పష్టమైన ప్రతినిధి. ఈ సంస్థ ద్వారానే దేవుడు మానవాళికి బైబిల్ సత్యాలను బోధిస్తున్నాడు. ఈ సంస్థకు వేరుగా, దాని సాహిత్య సహాయం లేకుండా లేఖనాల నిజమైన అర్థాన్ని గ్రహించడం అసాధ్యం. ప్రపంచంలోని ఇతర సంఘాలు, సంస్థలు అన్నీ దేవుడు నిర్దేశించినవి కావు, అవన్నీ మోసపూరితమైనవి, సాతాను సంబంధమైనవి.

**బి. దేవుడు:** దేవుని అసలు నామం 'యెహోవా', ఆయన మాత్రమే నిజమైన అద్వితీయ దేవుడు. దేవుని నామాన్ని సరిగా ఉపయోగించడం ఒకరు



**ప్రపంచ వ్యాప్తంగా వారానికి కనీసం 50 మంది ఈ యెహోవా సాక్షులుగా మారుతున్నారు, దానికోసం వాళ్ళు ప్రతి నెలా ప్రపంచ వ్యాప్తంగా 45 లక్షల బైబిల్ స్టడీస్ నిర్వహిస్తున్నారు అంటే అసత్యాన్ని ప్రకటించడానికి ఎంత తీవ్రతతో ప్రయత్నిస్తున్నారో ఇట్టే అర్థమవుతుంది. క్రీస్తు సాక్షుల మైన మనం ఎక్కడ ఉన్నామో ఆత్మపరిశీలన చేసుకోవలసిన సత్యాలివి!**

రక్షణ పొందడానికి ఆవశ్యం. కేవలం యెహోవా సాక్షులు దేవుని నామాన్ని నిలకడగా ఉపయోగిస్తారు గనుక వాళ్ళు మాత్రమే దేవునికి నిజమైన అనుచరులు. మిగిలిన డినామినేషన్స్‌కు చెందినవాళ్ళు అందరూ సాతాను చేత ప్రభావితమైన వాళ్ళు.

**సి. యేసు క్రీస్తు:** యెహోవా సాక్షులు యేసు సర్వశక్తి గల దేవుడు కాదు అని బోధిస్తారు, ఆయన 'దేవుడే' (god) గానీ 'మహా దేవుడు' (Almighty God) కాదు. యెహోవా ఇతరమైన వాటన్నిటి కంటే ముందుగా యేసుని సృష్టించడం జరిగింది, అందుకే ఆయనను అద్వితీయ కుమారుడు అంటారు అనేది వాళ్ళ భావన. ఇంకా వాళ్ళు ఆయన గురించి బోధించే తప్పుడు బోధలు – ఆయన భూమి మీద పరిపూర్ణ మానవుడిగా జీవించడానికి పూర్వం యెహోవా దేవుని సన్నిధిలో 'ఆత్మీయ వ్యక్తిగా' జీవిస్తూ సన్నిహిత సాహచర్యం అనుభవించాడు. ఆయన పరలోకంలో ప్రధాన దూత అయిన "మిఖాయేలు"గా జీవించాడు. యేసు కేవలం మానవుడు, మానవుడిగా జీవించి మరణించాడు. యేసు సిలువలో కాకుండా ఒక కొయ్య మీద చనిపోయి, మూడవ దినాన ఆత్మజీవిగా మాత్రమే లేచాడు (మిఖాయేలు) అంతే తప్ప భౌతిక పునరుత్థానం జరగలేదు. పూర్వం అనేక సందర్భాలలో దేవదూతలు కనిపించినట్లు పునరుత్థానుడైన యేసు కూడా రకరకాల శరీరాల్లో శిష్యులకు కనిపించాడు. క్రీస్తు రెండవ రాకడ 1914 వ సంవత్సరంలోనే జరిగి పోయింది, అయితే ఆయన రెండవ రాకడ 'ఆత్మరూపంలో' జరిగింది. అప్పటి నుండి ఆయన "కావలి కోట" సంస్థ ద్వారా భూమి మీద తన రాజ్య పాలన చేస్తున్నాడు.

**డి. పరిశుద్ధాత్మ:** పరిశుద్ధాత్మ దేవుడు కాదు, వ్యక్తీ కాదు, కేవలం దేవుడు తన చిత్తాన్ని ఈ భూమి మీద నెరవేర్చుకోవడానికి వినియోగించే 'వ్యక్తిత్వం లేని క్రియాశీలక శక్తి' మాత్రమే అని బోధిస్తారు.

**ఇ. త్రిత్వం:** త్రిత్వం అనే పదమే బైబిల్లో లేదు, ముందుగానే ఊహించుకొన్న భావనలతో కాకుండా పక్షపాతం లేకుండా బైబిల్‌ను చదివే వాళ్ళు ఎవరూ త్రిత్వ సిద్ధాంతాన్ని అంగీకరించరు అని బోధిస్తారు. అది కేవలం బబులోను, ఐగుప్తు, అష్షూరు దేశాలకు చెందిన ఇతర అనాగరిక మతాల నుంచి స్వీకరించిన అసత్య సిద్ధాంతమని బోధిస్తారు.

**ఎఫ్. రక్షణ:** రక్షణ కృప ద్వారా యేసుక్రీస్తులో విశ్వాసం ఉంచడం ద్వారా వస్తుందని తరచూ బోధించినా, కావలి కోట సంస్థకు సంపూర్ణ విధేయత చూపించకుండా దాని కార్యకలాపాల్లో పాల్గొనకుండా రక్షణ పొందడం అసాధ్యం అంటారు. రక్షణను విధేయత ద్వారా సంపాదించుకోవాలి. "జీవ గ్రంథంలో ఒకరి పేరు ఉండడం అతని క్రియల మీద ఆధారపడి ఉంటుంది" అని బోధిస్తారు. యెహోవా సాక్షులు నిత్య జీవమనే బహుమానం పొందడానికి నిరంతరం కష్టించి పనిచేయాలని, కావలి కోట సాహిత్యాన్ని పంచిపెట్టడం కష్టించి పనిచేయడంలో భాగమని బోధిస్తారు.

**జి. దేవుని ప్రజలు రెండు గుంపులుగా ఉంటారు:** రక్షణ పొందిన ప్రజలు (యెహోవా సాక్షులు మాత్రమే) రెండు భిన్న తరగతులకు చెంది ఉంటారు కనుక భిన్నమైన గమ్యస్థానాలకు చేరుకుంటారు, భిన్నమైన ఆధిక్యతలు పొందుతారు. పరలోకానికి కేవలం అభిషేకం పొందిన 1,44,000 మంది మాత్రమే చేరుకొని దేవుని కుమారులుగా పరలోక రాజ్యాన్ని పంచుకొంటారు. వీరు భౌతిక శరీరాలు లేకుండా పరలోకంలో ఆత్మ రూపంలో నివసిస్తారు. అభిషేకం లేని రక్షణ పొందిన మిగిలిన యెహోవా సాక్షులందరూ (వేరొక మంద) భూమి మీద

పరదైసులో నిత్యమూ నివసిస్తారు. 1935 వ సంవత్సరంలోనే 1,44,000 జాబితాలో ఉండే వారి సంఖ్య పూర్తి అయిపోయింది కనుక, ఆ సంవత్సరం తరువాత ఉండే యెహోవా సాక్షులు అందరూ భూమిమీద నివసించడానికి నిరీక్షించవలసినదే!

**హెచ్. మరణానంతర ఉనికి:** మనిషి చనిపోయిన తరువాత 'స్పృహ' కలిగిన ఉనికి ఏమీ ఉండదు. చనిపోయిన నీతిమంతులు కూడా భవిష్యత్తులో పొందే పునరుత్థానం వరకూ ఏవిధమైన 'స్పృహ' లేకుండానే ఉంటారు. అనీతిమంతులు చనిపోయిన తరువాత 'ఉనికిలో లేకుండా నాశనం అయిపోతారు' (Annihilation), వాళ్ళు నరకంలో స్పృహ కలిగి జీవిస్తారు అనేది కేవలం సాతాను బోధ అని బోధిస్తారు. వాళ్ళ దృష్టిలో నరకం అనేది మనుషులందరి ఉమ్మడి సమాధి మాత్రమే.

**ఐ. వివాదాస్పద అంశాలు:** రక్త మార్పిడి, అవయవాల మార్పిడి, టీకాలు వేయించుకోవడం, పుట్టినరోజులు జరుపుకోవడం, సిలువను ధరించడం మొదలైన వాటిని నిషేధించింది కావలి కోట సంస్థ. అయితే తరువాత వీటిలోని కొన్ని విషయాలపై తన మాట మార్చుకొన్నది.

## 3. యెహోవా సాక్షుల సాహిత్యం, ప్రభావం:

ప్రస్తుతం 'కావలి కోట' మ్యాగజైన్ ప్రతి నెలా 106 భాషల్లో 178 లక్షల కాపీలు ముద్రితమవుతుంటే, 'తేజరిల్లు' మ్యాగజైన్ 156 కోట్ల కాపీలు ముద్రితమవుతున్నాయి. వాళ్ళు తర్జుమా చేసుకొన్న బైబిల్ నెలకు 30 లక్షల కాపీలు ప్రింట్ అవుతున్నాయి, ఇప్పటి వరకూ ఒక కోటి కాపీలను పంచిపెట్టడం జరిగింది. వీరి ఇతర గ్రంథాలు: బైబిల్ నిజంగా ఏమి బోధిస్తుంది, Reasoning from the Scriptures, Should you believe in the Trinity? ప్రపంచ వ్యాప్తంగా వారానికి కనీసం 50 మంది ఈ




యెహోవా సాక్షులుగా మారుతున్నారు, దానికోసం వాళ్ళు ప్రతి నెలా ప్రపంచ వ్యాప్తంగా 45 లక్షల బైబిల్ స్టడీస్ నిర్వహిస్తున్నారు అంటే అసత్యాన్ని ప్రకటించడానికి ఎంత తీవ్రతతో ప్రయత్నిస్తున్నారో ఇట్టే అర్థమవుతుంది. క్రీస్తు సాక్షులమైన మనం ఎక్కడ ఉన్నామో ఆత్మపరిశీలన చేసుకోవలసిన సత్యాలివి!

## 4. యెహోవా సాక్షులు - విమర్శ

### ఎ. విఫలమైన ప్రవచనాలు:

భూమ్మీద దేవుని ప్రతినిధిగా చెప్పుకొనే కావలి కోట సంస్థ చెప్పిన ప్రవచనాలు ఘోరంగా విఫలమయ్యాయి.[5] 1914వ సం॥లో లోకం అంతమైపోతుందని, 1925వ సం॥లో పాతనిబంధన పితరులైన అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు సమాధులలోనుండి లేస్తారని, 1873వ సం॥లో లోకం అంతమైపోయి క్రీస్తు వెయ్యేండ్ల పాలన ప్రారంభమౌతుందని చెప్పి తరువాత 1975వ సంవత్సరంలో జరుగుతుందని చెప్పిన ప్రవచనాలన్నీ తప్పుడు ప్రవచనాలని రుజువైపోయాయి. ద్వితీయోపదేశ కాండం 18:22 ప్రకారం ప్రవచనం నెరవేరకుండా విఫలం చెందడమే ఆ ప్రవక్త దేవుని సందేశాన్ని చెప్పలేదు అనడానికి, అతడు నిజమైన ప్రవక్త కాదూ అనడానికి ప్రాతిపదిక. కాబట్టి దేవుని వాక్యానుసారం కావలి కోట దేవుని ప్రతినిధి అయ్యే అవకాశమే లేదు.

'కావలి కోట సంస్థ' తరచూ తన సిద్ధాంతాలను మార్చుకొంటూ వచ్చింది. టీకాలు వేయించుకోవడాన్ని 1930 సంవత్సరాల్లో నిషేధించిన సంస్థ, 1950 సంవత్సరాలలో అనుమతించింది. అలాగే అవయవ మార్పిడిని 1967 లో నిషేధించి 1980 సంవత్సరంలో నిషేధాన్ని వెనుకకు తీసుకుంది. ఇలాంటి పరస్పర విరుద్ధ సిద్ధాంతాలను బోధించిన సంస్థ 'దేవుని ప్రవచానాత్మక ప్రతినిధి' ఏమాత్రం కాదు.

### బి. సిద్ధాంతాలు:

త్రిత్వం అనే పదం బైబిల్‌లో లేనప్పటికీ దేవుడు త్రియేక దేవుడు అనే భావన బైబిల్లో స్పష్టంగా ఉంది. దేవుడు ఒక్కడే అని బైబిల్ బోధిస్తుంది (ద్వితి 6:4), అయితే ఆ దేవునిలో ముగ్గురు విలక్షణ వ్యక్తులు ఉన్నారు. ఈ ముగ్గురినీ లేఖనం 'దేవుడు' అని సంబోధిస్తుంది: తండ్రి (1 పేతురు 1:2), కుమారుడు (యోహాను 20:28), పరిశుద్ధాత్ముడు

(అ.కా 5:3-5). అంతేకాదు ముగ్గురు వ్యక్తులూ దేవునికి ఉండే స్వభావ లక్షణాలు కలిగి ఉన్నారు: స్థలానికి పరిమితం కాకపోవడం (కీర్తన 139:7; మత్తయి 19:26; మత్తయి 28:18), సర్వ జ్ఞానం (మత్తయి 9:4; రోమా 11:33; 1 కొరింథీ 2:10), సర్వశక్తి కలిగి ఉండడం (మత్తయి28:18; రోమా 15:19; 1 పేతురు 1:5). త్రిత్వం ఇతర అనాగరిక మతాల నుండి స్వీకరించిన అసత్య సిద్ధాంతం అయ్యే అవకాశం లేదు ఎందుకంటే ఈ అనాగరికులు "బహుదేవతారాధకులు", కానీ ఆదిమ క్రైస్తవులు "ఒకే ఒక్క త్రియేక దేవున్ని" విశ్వసించారు.

బైబిల్ స్పష్టంగా బోధించే సత్యం యేసు సంపూర్ణ దైవత్వం, ఇలాంటి స్పష్టమైన సిద్ధాంతాలనే 'కావలి కోట' తృణీకరిస్తుంది. కానీ బైబిల్లో ఆయనను దేవుడిగా పిలవడం జరిగింది (యోహాను 20:28; హెబ్రీ 1:8), దేవుని నామమైన 'యెహోవా' ను ఆయనకు ఆపాదించడం చూస్తాం (యెషయా 9:6; 40:3; మార్కు 1:1-3), ఆయన దేవుని స్వభావ లక్షణాలైన - స్థలానికి పరిమితమవ్వక పోవడం (మత్తయి 18:20; యోహాను 1:47-49), సర్వజ్ఞానం (యోహాను 2:25), సృష్టిని కలిగించడం ద్వారా సర్వశక్తిమంతుడుగా ఉండడం (యోహాను 1:3; కొలస్సీ 1:16-17; హెబ్రీ 1:2-3) యేసు క్రీస్తు సొంతం. దేవున్ని మాత్రమే మొక్కాలి అని బోధించిన యేసు క్రీస్తు అనేక సందర్భాలలో ప్రజలు ఆయనకు మొక్కినప్పుడు ఎప్పుడూ ఆటంక పరచలేదు (మత్తయి 2:11, 8:2, 9:18, 28:9, 28:17; యోహాను 9:38, 20:28). యెహోవా సాక్షులు ఇతర నకిలీ మతాలలాగే తమ సిద్ధాంతాల ను తరచూ మార్చుకొంటూ వచ్చారు. యేసుని ఆరాధించాలని కొన్ని సంవత్సరాలు (1879, 1880, 1892, 1898, 1941, 1945, 1954), ఆరాధించకూడదు అని కొన్ని సంవత్సరాలూ (1959, 1964) బోధించారు. విచిత్రమేమంటే యేసుని ఆరాధించమని బోధిస్తున్న హెబ్రీ 1:6 వచనాన్ని వాళ్ళ సొంత బైబిల్ తర్జుమాలోనే 1961 వ సంవత్సరం "ఆరాధన" గానూ 1971వ సంవత్సరం లో "గౌరవం" గానూ తర్జుమా చేయడం! [6]

'కావలి కోట' పరిశుద్ధాత్ముడు శక్తి మాత్రమే అని బోధిస్తుంది, దానికి విరుద్ధంగా బైబిల్ పరిశుద్ధాత్ముడు దేవుడని చెబుతుంది (అ. కా. 5:3-5; హెబ్రీ 9:14). ఆయనకు వ్యక్తికి ఉండే లక్షణాలైన మనస్సు (రోమా 8:27), భావోద్రేకాలు (ఎఫెసీ 4:30), చిత్తం (1 కొరింథీ 12:11) ఉన్నాయి. అంతే కాదు ఆయన వ్యక్తి మాత్రమే చేయగల్గిన పనులైన బోధించడం (యోహాను 14:26), సాక్షమివ్వడం (యోహాను 15:26), నడిపించడం (రోమా 8:14), నియమించడం (అ.కా 1:24), ఆజ్ఞాపించడం (అ.కా 8:29), విజ్ఞాపన చెయ్యడం (రోమా 8:26), మాట్లాడడం (యోహాను 15:26; 2 పేతురు 1:21) లాంటివి చేయడం చూస్తాము.

ఇలాంటి నకిలీ క్రైస్తవ మతాల పట్ల ప్రతి విద్యార్థి, గ్రాడ్యుయేట్ జాగ్రత్తతో ఉండాల్సిన అవసరం ఎంతో ఉంది. ఈ సందర్భంలో అపోస్తులుడైన పౌలు మాటలు గమనార్హం: "దేవుడు స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులుగా ఉంచెనో ఆ యావత్తు మందను గూర్చియు జాగ్రత్తగా ఉండుడి. నేను వెళ్లి పోయిన తరువాత క్రూరమైన తోడేళ్ళు మీలో ప్రవేశించునని నాకు తెలియును; వారు మందను కనికరింపరు" (అ.కా. 20:28-29).

నకిలీ క్రైస్తవ మతాన్ని అవలంభించే వ్యక్తిని తిరస్కరించడం, అసహ్యించుకోవడం చాలా సులువు. కానీ వాళ్లకు ప్రార్థనా పూర్వకంగా సత్య సువార్తను ప్రకటించడం, బైబిల్ సత్యాలను (వాళ్ళు గ్రహించేలా) చెప్పడానికి ప్రయత్నించడం ప్రతి క్రైస్తవుని బాధ్యత - ప్రాముఖ్యంగా ప్రతి ఇవాంజెలికల్ గ్రాడ్యుయేట్ బాధ్యత. ఇది "యేసు సాక్షులుగా" దేవుడు మనకు ఇచ్చిన పిలుపు, ఆజ్ఞ (అ. కా. 1:8). అయితే వాళ్లకు ప్రభావవంతంగా సువార్త ప్రకటించడానికి కొంత మెలకువలు, సిద్ధపాటు, తర్ఫీదు అవసరం అని మర్చిపోకూడదు.

**- డి. అనిల్ కుమార్,** వైజాగ్

**Notes:**


1. The message of Galatians by John Stott, BST series
2. Unmasking the Cults by Allen Gomes, P-7
3. The Essential Doctrines of the Christian Faith (Part 2): A Logical Approach by Norman Geisler, Christian Research Journal
4. The Jehovah's Witnesses and Jesus Christ, Theology Today Journal, P 65-85.
5. How to Rescue Your Loved One from the Watch Tower by David Reed, P-47
6. Index of Watch Tower Errors by David Reed

# రిస్క్ తీసుకోవాలి...

సాయంత్రం 6:00 గంటలు, భీమవరంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం దగ్గర ఉన్న పార్క్‌లో కూర్చొని ఉన్న మనోహర్ మదిలో ఏవేవో ఆలోచనలు మొదలయ్యాయి. క్రిస్మస్ సీజన్ వచ్చేసింది, ఎవరికైనా సువార్త ప్రకటిస్తే, ఏదైనా చేస్తే ఎలా ఉంటుంది... అమ్మో, ఎందుకులే రిస్క్, అయినా నా వల్ల ఏ మవుతుంది... ప్రతి సంవత్సరం క్రిస్మస్ వస్తుంది పోతుంది. ఏమి చేద్దామనే ఆలోచనే రాకుండా చూసుకోవడం ఉత్తమమైన పని.

ఇంతలో ఫోన్‌కి ఏదో మెసేజ్ వచ్చినట్లు అనిపించి ఫోన్ చూస్తూ ఉండిపోయాడు. 'మనోహర్' అని ఎవరో పిలిచినట్లు అనిపించి వెనక్కి తిరిగి చూశాడు. రాజేష్ అన్న తన ఇద్దరు పిల్లల్ని పార్క్‌కి తీసుకొచ్చాడు. వాళ్ళు ఆడుకుంటున్నారు. ఇంతలో అన్న, మనోహర్ దగ్గరికి వచ్చి 'తమ్ముడూ ఎలా ఉన్నావు? అంటూ పలకరించి, క్రిస్మస్ సీజన్ వస్తుంది కదా ఏమి చేద్దాం అనుకుంటున్నావ్ అని అడిగేసరికి..దానిలోని రిస్క్ గుర్తుకు వచ్చి... అన్నా.. అది.. అంటూ ఏదో చెప్పబోయే సరికి ఇంతలో అన్న వాళ్ళ పాప శ్రేష్ట ఏడుపు వినిపించింది. తమ్ముడు మళ్ళీ కలుద్దాం అంటూ రాజేష్ అన్న వెళ్ళిపోయాడు.

హమ్మయ్య! థ్యాంక్ గాడ్.. ఏ మాట వినిపించకూడదని అనుకొంటున్నానో ఆ మాట వినిపించింది. అయినా సమాధానం చెప్పకుండా తప్పించావు.

రాజేష్ అన్న ఎప్పుడూ 'ఏం చేద్దాం' అంటాడు. ఏంటో అనుకుంటూ అక్కడ నుండి మనోహర్ వెళ్ళిపోయాడు.

ఆ మరుసటి రోజు ఆదివారం ఆరాధనకు వెళ్ళడానికి సిద్ధపడుతుండగానే ఫోన్ రింగ్ అయింది. అటువైపు పాస్టర్ వినోద్ అన్న ఫోన్లో "హలో తమ్ముడూ, ఆరాధనకి టైమ్‌కి వచ్చేయ్, ఆరాధన మానకు, అభిషేకన్న స్పీకర్‌గా వస్తున్నారు" అంటూ మనోహర్ సరే అనే లోపే ఫోన్ కట్ అయింది.

గత వారం ఆరాధనకు వెళ్ళకపోయేసరికి అన్నకి డౌట్ వచ్చినట్లుంది. ఫర్వాలేదులే, లేట్‌గా వెళ్ళినా ఏమీ కాదులే. టైమ్‌కి వెళ్ళాలా? ఏంటి అనుకుంటూ లేట్ చేయసాగాడు. ఆరాధన మానేస్తే తప్పుగానీ లేట్‌గా వెళితే ఏమీ కాదులే, లైట్ తీసుకో అని తనలో తను అనుకొంటూ ఆలస్యంగానే వెళ్ళాడు.

మనోహర్ చర్చ్‌కి వెళ్ళేసరికి ప్రసంగం ప్రారంభమై 'ఎక్కలేనంత ఎత్తైన కొండపైకి ఎక్కించు' అని దావీదు గురించి వివరిస్తున్నాడు అభిషేక్ అన్న. దావీదు దేవుని నామానికి అవమానం వస్తుందని తెలిసి వెంటనే రిస్క్ తీసుకొని గొల్యాతుతో యుద్ధంలో గెలిచి దేవుని నామానికి మహిమ తీసుకొచ్చాడు అంటూ సాగిపోతున్న ప్రసంగంలో 'రిస్క్' అనే మాట మనోహర్ చెవిలో గిర్రున తిరిగింది.

మనోహర్ దావీదు గురించి ఆలోచిస్తుండగానే అభిషేకన్న విలియం కేరి గురించి చెబుతూ "దేవుని కోసం గొప్ప కార్యాలు తలపెట్టు దేవుని దగ్గర నుండి గొప్ప కార్యాలు ఆశించు" అంటూ ప్రసంగం కొనసాగిస్తున్నాడు. మరలా మనోహర్ మదిలో విలియం కేరి 'రిస్క్' తీసుకొని ఇండియాకు వచ్చి ఇంత గొప్ప సేవ చేసి దేశానికి దీవెనగా మారాడా? అలా అయితే నేను కూడా 'రిస్క్' తీసుకోవాలా? నావల్ల కాదులే, మనకెందుకు .. వచ్చామా, విన్నామా, వెళ్ళామా అంటూ ఆరాధన అవ్వగానే రూమ్‌కి వచ్చేశాడు.

మనోహర్ మదినిండా 'రిస్క్' తీసుకోవాలనే మాటలే గుర్తుకు వస్తున్నా చాలా బలవంతంగా వాటిని అణచివేస్తున్నాడు. ఆ రాత్రి సరిగా నిద్ర కూడా పట్టలేదు. తెల్లవారకముందే మెలకువ వచ్చింది. క్వైట్‌టైమ్ చేసుకొందామని బైబిల్, నోట్స్ తెచ్చుకొని కూర్చున్నాక, క్రిస్మస్ సీజన్ కదా రోజూ చదివే వాక్యభాగం కాకుండా లూకా సువార్త చదువుదాం అనుకొని లూకా సువార్త 1వ అధ్యాయం చదవడం

ప్రారంభించాడు. అలా చదువుతుండగా 1:38 దగ్గర ఆగిపోయాడు. "ప్రభువు దాసురాలను నీ మాట చొప్పున జరుగును గాక...". ఆ మాట దగ్గర తన నోట్స్‌లో తల్లి అయిన మరియ యేసుక్రీస్తు ప్రభువును ఈ లోకానికి అందించడానికి 'రిస్క్' తీసుకొన్నది అని రాసుకొన్నాడు.

మనోహర్ వాక్యం చదువుతుండగా దేవుడు వెలిగింపు ఇవ్వడం ప్రారంభించాడు. తన నోట్స్‌లో వాటిని ఇలా రాసుకొన్నాడు. "ప్రతికూల పరిస్థితుల్లో రిస్క్ తీసుకునేవారు కావాలి. ప్రతికూల పరిస్థితులే గొప్ప పరిచర్యకు పునాది". అలా తన నోట్స్‌లో రాసుకుంటూ కళ్ళ వెంట కారుతున్న కన్నీటిని తుడుచుకొంటూ "నేను నీ దాసుడను ప్రభువా" అంటూ దేవునికి అప్పగించుకొన్నాడు. మనస్ఫూర్తిగా క్రిస్మస్ సీజన్‌లో ఏదైనా చేయాలని మనసులో చిన్న ప్రార్థన చేసుకొన్నాడు. కానీ ఏం చేయాలి? ఎలా చేయాలి? అనే ప్రశ్నలు ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే వెంటనే రాజేష్ అన్న గుర్తుకు వచ్చాడు.

ఆ సాయంత్రమే అన్న దగ్గరికి వెళ్ళాలని నిర్ణయించుకొని కాలేజీకి వెళ్ళాడు. మధ్యాహ్నమే రాజేష్ అన్నకి ఫోన్ చేసి ఇంటికి వస్తానని చెప్పాడు. కాలేజీ అయిపోయిన వెంటనే రూమ్‌కి వెళ్ళి ఫ్రెష్ అయ్యి అన్న దగ్గరికి వెళ్ళాడు. అన్న వాళ్ళ పిల్లలు హోంవర్క్ చేసుకొంటున్నారు. అక్క కిచెన్‌లో ఉంది. అన్న కూరగాయలు కోసం బయటికి వెళ్ళారని అక్క చెప్పింది. కొద్దిసేపటికి చక్కటి చిరునవ్వుతో చిక్కటి టీ చేతికి వచ్చింది. వాహ్‌తాజ్ అంటూ టీని ఆస్వాధిస్తూ తాగడం ముగించే లోపు రాజేష్ అన్న బండి సౌండ్ వినిపించింది. హాయ్ మనోహర్, జస్ట్ ఎ మినిట్ అంటూ కూరగాయలు అక్కకు అప్పగించి వచ్చి మనోహర్ పక్కన కూర్చొన్నాడు. మనోహర్ మాట్లాడుతూ, "అన్నా క్రిస్మస్ సీజన్ వస్తుంది కదా ఏమైనా చేద్దామని అనిపిస్తుంది కానీ ఏం చేయాలో, ఎలా చేయాలో, అర్థం కావడం లేదు అందుకే మీ దగ్గరికి వచ్చాను.

ఇంతలో అక్క వచ్చి "మనోహర్ రాత్రికి భోజనం ఇక్కడే చేసి వెళ్ళు" అంటూ ఆప్యాయంగా చెప్పింది. మనోహర్‌కి మనసులో పట్టరాని సంతోషం. రూమ్‌లో వండే కూరలు తినలేక చచ్చిపోతున్నాను, ఈరోజు అక్క చేతి వంట తినొచ్చని. రాజేష్ అన్న, తమ్ముడూ పార్క్‌లో నిన్ను కలిసినప్పటి నుంచి నీ గురించే ఆలోచిస్తూ, ప్రార్థన చేస్తున్నాను. అయితే దేవుడు నాకు ఇచ్చిన ఆలోచన ఏంటంటే మీ కాలేజీలోని మీ యాజమాన్యం అనుమతితో క్రిస్మస్ ప్రోగ్రాం పెడితే ఎలా ఉంటుంది? ఆ మాటకి మనోహర్‌కి అంత ఫ్యాన్ గాల్లో కూడా చెమటలు పడుతున్నాయి. రాజేష్ అన్న చెప్పిన మాటలకు అక్కడి నుండి పారిపోతే బాగుండనిపించింది. అంతలో రాజేష్ అన్న "తమ్ముడూ నాకు తెలుసు మీ కాలేజీలో క్రిస్మస్ ప్రోగ్రాం పెట్టడం అంత సులువు కాదు. ఎందుకంటే గత 20 సంవత్సరాలుగా అక్కడ క్రిస్మస్ ప్రోగ్రాం జరగలేదు. ఇతర విశ్వాసాలవాళ్ళు ఎక్కువగా ఉన్నారు. క్రైస్తవులను చాలా చిన్నచూపు చూస్తున్నారు. పైగా ఇంజనీరింగ్ కాలేజ్. నీవు తప్ప ఇయు స్టూడెంట్స్ అక్కడ ఎవరూ లేరు. దాదాపు 8,000 మంది విద్యార్థులు ఉన్న కాలేజీకి సువార్తను అందించే గొప్ప అవకాశం. ఫైనల్ ఇయర్, తర్వాత నువ్వు అక్కడ ఉండవు. ఆలోచించు అంటూ" అన్నకి ఫోన్ రాగానే ఫోన్‌లో మాట్లాడుతూ పక్కకు వెళ్ళాడు.

మనోహర్‌కి అర్థమవుతుంది. అన్ని ప్రతికూల పరిస్థితులే. తన డిపార్ట్మెంట్లో ఫ్యాకల్టీ అంతా ఇతర విశ్వాసులే. అంత ఈజీగా అవుతుందా? రిస్క్ కదా. అసలే ఫైనల్ ఇయర్, ప్రాజెక్ట్ మార్కులు, పైగా క్యాంపస్ ఇంటర్వ్యూలు, చాలా పెద్ద రిస్క్ చేయాలి. ఇంకొక నాలుగు నెలలు ఆగితే ఇంజనీరింగ్ పూర్తి చేసుకొని వెళ్ళిపోతాను. నాకెందుకు ఈ తిప్పలు నావల్ల కాదులే అనుకుంటూ రాజేష్ అన్నకి నో చెబుదామని మనసులో గట్టిగా నిర్ణయించుకొన్నాడు.

కాసేపటికి అక్క ఫ్యామిలీ ప్రేయర్ చేసుకొని భోజనం చేద్దామని అన్నతో చెప్పింది. మనోహర్‌కి మనసు కొంచెం కష్టంగానే అనిపిస్తుంది అయినా సరే ఫ్యామిలీ ప్రేయర్‌లో వారితో పాటు కూర్చొన్నాడు. పాటలు పాడిన తర్వాత వాక్యం చదువుకొందాం అని నిర్గమకాండం ఒకటవ అధ్యాయం అన్న చదువగా, అక్క కొంచెం వివరిస్తాను అంటూ కొన్ని మాటలు చెబుతూ మధ్యలో "మోషే తల్లి రిస్క్ తీసుకొంది. మోషే విషయం ఏమాత్రం తెలిసినా ఐగుప్తు సైనికులు మోషేను, అతని తల్లిదండ్రులను చంపేస్తారని తెలిసి కూడా రిస్క్ తీసుకొని దాచారు. దాని వలన ఇశ్రాయేలీయులకు గొప్ప నాయకుడిని అందించారు. మనం కూడా దేవుని నామ మహిమ

కోసం రిస్క్ తీసుకోవాలి అంటూ అక్క ముగించింది. అంతలో అన్న, మనోహర్ ప్రార్థన చెయ్యి అనేసరికి పొడిపొడిగానే చేసి ప్రార్థన ముగించాడు. తర్వాత అక్క చక్కటి భోజనం పెట్టింది. అందరికీ గుడ్ నైట్ చెప్పి అక్కడి నుండి రూమ్‌కి వెళ్ళి పోయాడు మనోహర్.

రూమ్‌కి వెళ్ళాడే కానీ మనసు మనసులో లేదు. దేవుడు పదే పదే రిస్క్ గురించి మాట్లాడుతున్నా ఏదో తెలియని భయం. “గొప్ప పరిచర్యకి పరిస్థితులు ప్రతికూలంగానే ఉంటాయి” అనే మాట గుండెను గుచ్చుతుంది. దేవుడు తన ద్వారా తన కాలేజీలో ఏదో గొప్ప పని చేయబోతున్నాడు. అయితే తనే తప్పించుకోవడానికి సకల ప్రయత్నాలు చేస్తున్నట్లు అర్థమై ఏడ్వడం ప్రారంభించాడు. దేవా, ఏదో ఒకటి చేస్తాను ధైర్యం ఇవ్వు. రిస్క్ తీసుకొంటాను. తోడుగా ఉండు అంటూ నిర్ణయాత్మకమైన ప్రార్థన చేసి పండుకొన్నాడు.



మరుసటి రోజు సాయంత్రం రాజేష్ అన్నను కాలేజ్ దగ్గరకు రమ్మని చెప్పాడు మనోహర్. ఇద్దరూ కలిసి కొద్దిసేపు కాలేజీ గురించి ప్రార్థన చేసి ఏం చేద్దాం? ఎలా చేద్దాం? అంటూ చర్చించుకోసాగారు. తర్వాత రాజేష్ అన్న ఇలా చెప్పాడు.

1. ఇయు సభ్యుల ప్రార్థన సహాయం కోరదాం.
2. నీవే ప్రిన్సిపాల్‌కి చక్కగా లెటర్ రాసి పర్మిషన్ అడుగు.
3. పర్మిషన్ వస్తుంది. దేవుడు సహాయం చేస్తాడు. అప్పుడు మీ కాలేజీలో ఉన్న క్రైస్తవ విశ్వాసులైన సార్స్,మేడమ్స్‌తో మాట్లాడి వారి సపోర్ట్ అడుగు.
4. ఆ తర్వాత నీకు తెలిసిన క్రైస్తవ విద్యార్థులతో విషయాలు చెప్పి, వారితో కలిసి పనిచేస్తే ప్రోగ్రాం పెట్టగలం.
5. ఫైనాన్షియల్ సపోర్ట్, అరేంజ్మెంట్స్, స్పీకర్ గురించి ఇజియఫ్ వాళ్ళ సపోర్ట్ తీసుకొందాం.

వారం రోజులు మనిద్దరం కలిసి ప్రార్థన చేసిన తర్వాత మనం అనుకున్నవి స్టార్ట్ చేద్దాం అంటూ అన్న ముగించాడు.

వారం రోజులు ప్రార్థన చేసిన తర్వాత మనోహర్ ప్రిన్సిపాల్ పర్మిషన్ కోసం లెటర్ ఇచ్చే రోజు రానే వచ్చింది. చాలా రిస్క్ అనిపిస్తున్నప్పటికీ దేవుడు సహాయం చేస్తాడనే ధైర్యంతో ముందుకు వెళ్ళాడు. లెటర్ తీసుకొని ప్రిన్సిపల్ దగ్గరికి వెళ్ళి ఇచ్చాడు. ప్రిన్సిపల్ లెటర్ చదివి మన కాలేజీలో ఎప్పుడూ ఇలాంటివి లేవు. అయినా స్టూడెంట్స్ ప్రోగ్రాం చేసుకోవడానికి, అది క్యాంపస్‌లోని గ్రౌండ్లో చేసుకోవడానికి ఎలా పర్మిషన్ ఇస్తాము? అంటూ కాసేపాగి సరేలే, ఎవరైనా ఫ్యాకల్టీని తీసుకొని రా, ఆయనతో మాట్లాడి నిర్ణయం చెబుతాను అని మనోహర్‌ని బయటికి పంపించాడు. మనోహర్ కాలేజీలో తెలిసిన క్రైస్తవ ఫ్యాకల్టీతో మాట్లాడుతున్నాడు. ఏ ఫ్యాకల్టీ కూడా నేను ఉన్నాను అని చెప్పి ముందుకు రావడం లేదు. చాలా నిరాశతో ప్రభువా ఏం చేయమంటావు ప్రతి ఫ్యాకల్టీ భయపడుతున్నారు అంటూ చివరి ప్రయత్నంగా సుధీర్ సార్ దగ్గరికి వెళ్ళాడు. సుధీర్ సార్ ఒప్పుకోవడం, ప్రిన్సిపల్ సార్ కూడా ఒప్పుకోవడం, కాలేజీ ఛైర్మన్ రావడం అంతా క్షణాల్లో జరిగిపోతుంటే మనోహర్‌కి ఏమీ అర్థం కావడం లేదు. ఆశ్చర్యంగా 10 నిమిషాల్లో పర్మిషన్ వచ్చేసింది. మనోహర్ దేవుని నమ్మకత్వాన్ని చూసి స్తుతించకుండా ఉండలేకపోయాడు. 20 సంవత్సరాల కాలేజీ చరిత్రలో ఇదే మొదటిసారి. మిగతా పనులన్నీ చక్కగా చకచగా జరిగిపోయాయి. అభిషేకన్న స్పీకర్‌గా వచ్చాడు. దాదాపుగా 1500 మంది స్టూడెంట్స్ వచ్చి చక్కగా సువార్త విని చాలామంది వాక్యానికి స్పందించి, రక్షించబడ్డారు.

క్రిస్మస్ ప్రోగ్రాం అంతా అయిపోయిన తర్వాత గ్రాడ్యుయేట్స్ మనోహర్‌ని అభినందించారు. మనోహర్‌కి జరిగినదంతా ఒక కలలా ఉంది. “దేవా నన్నేనా మీరు వాడుకొంది, నేను చూపించిన ఈ చిన్న రిస్క్ ఎంత గొప్ప పరిచర్యకు పునాది వేసింది, థాంక్యూ దేవా” అంటూ నిద్రలోకి జారుకున్నాడు.

ప్రియ తమ్ముడూ, చెల్లీ మరి మీ కాలేజీ పరిస్థితి ఏంటి? సువార్తను అందించడానికి క్రిస్మస్ సీజన్ మంచి అవకాశం. ఈ అవకాశం మరలా సంవత్సరం తర్వాతనే. రిస్క్ తీసుకొంటావా? సువార్తను అందిస్తావా? మార్పుకు నాంది పలుకుతావా?

**– యం.గాలెయ్య**, భీమవరం

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No.: **GTR/59/2024-2026**

**Date of Printing: 25-11-2025**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. B. Hanumantha Rao
Edited by Mr. P. Sunil Jacob and published by UESI-AP, Nambur - 522 508

# నిన్నెలా అర్థంచేసుకోను ప్రభూ!



ఆది దంపతులు ఆజ్ఞను అతిక్రమించినపుడు
క్షమించి వదిలేస్తే పోయేదేమో!
వారిని బహిష్కరించావు
రక్షణ ప్రణాళికను ఆవిష్కరించావు!!

యాకోబు మోసగాడని తెలుసు,
దావీదు చీకటి కోణం తేటతెల్లమే!
యాకోబు దేవుడనన్నావు!
దావీదు కుమారుడనని అనిపించుకున్నావు!!

నజరేతులో నుంచి మంచిదేదీ రాదనీ,
యోనా అవిధేయుడని మాకు తెలుసు!
నజరేయుడవయ్యావు,
చెడ్డ తరమువారికి యోనాను గూర్చిన సూచనయే
అనుగ్రహించావు!!

వంచకుడని తెలిసీ యూదాను అక్కున చేర్చుకున్నావు
నిన్నెరుగనని ముమ్మారు బొంకిన పేతురును
పునరుద్ధరించావు!
జీవితమంతా వ్యర్థం చేసుకున్న దొంగకి సహా,
మనసార మరో అవకాశమిచ్చి పరదైసుకు చేర్చావు!

ముమ్మారు పరిశుద్ధుడవని పరమందు కీర్తించబడుతూనే
నలుగురు కళంకితలకు నీ వంశావళిలో స్థానమిచ్చావు!
ఇహమందు పాపుల స్నేహితుడవయ్యావు,
నా కొరకు పాపముగా చేయబడ్డావు!!

దూరస్తుడనైన నన్ను వెదకి రక్షించావు,
నేరస్తుడనైన నన్ను నీతిమంతునిగా తీర్చావు,
నన్ను పరిశుద్ధుని చేసి నా స్థితిని మార్చావు!
నీ కుమారుని రూపాన్ని నాలో చెక్కుతున్నావు!

నిన్ను చూచి బ్రతుకు నరుడెవడూ లేడంటారు
భూమ్యాకాశములు నిన్ను పట్టజాలవంటారు
మరి నన్నే దేవాలయంగా మార్చుకున్నావు
ఒక దినం నిన్ను కన్నులారా చూస్తాననే
శుభప్రదమైన నిరీక్షణ నిచ్చావు!

కోపించుచునే వాత్సల్యము చూపించు దేవా
నన్నెంతగా కరుణించావు
ఎంత ఆయాసపెట్టినా దుఃఖపడ్డావే తప్ప
నన్నెన్నడు విడువలేదు, ఎడబాయలేదు!!

ప్రభూ, నిన్నెలా అర్థం చేసుకోను?
ఏమిచ్చి నీ రుణం తీర్చుకోను...??

– సందెపాగు సైమన్,
ఓయం, సికింద్రాబాద్